# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 28-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 21 పేజీలు 8 వెల: రూ.1/-


## మళ్లీ వరాలు కురిపించిన కేజ్రీవాల్

### నీటి బకాయిలు పూర్తిగా రద్దు

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దేశ రాజధాని ప్రజలపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి వరాలు కురిపించారు. నీటి బిల్లుల బకాయిలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు మంగళవారం ఆయన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఢిల్లీ నీటి మండలి రికార్డులను ప్రక్షాళన చేస్తూ నీటి బిల్లుల బకాయిలను రద్దు చేసే పథకాన్ని తాము ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. నీటి బకాయిల్లో వినియోగదారులు చెల్లించాల్సిన బిల్లు బకాయిలతో పాటు బిల్లింగ్‌లో దొర్లిన పొరపాట్లు కూడా ఉన్నాయని సీఎం వెల్లడించారు. ఢిల్లీలో అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి నీటి మీటర్లను బిగించుకుని ప్రధాన స్రవంతిలో కలవాలని, నవంబర్ 30లోగా మీటర్లు బిగించుకున్నవారికే తాము ఈ పథకాన్ని వర్తింపచేస్తామని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కాగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగానికి ఎలాంటి బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని ఇటీవల కేజ్రీవాల్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# స్వర్ణ సింధుకు ప్రధాని మోడీ అభినందన

### ఆమె విజయం గర్వకారణమని కితాబు
### అభినందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
### పదిలక్షల నజరానా అందచేత

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారత స్టార్ షట్లర్, వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధును ప్రధాని మోదీ అభినందించారు. ఆమె దేశానికి గర్వకారణమని అన్నారు. ఆమె ఎందరికో స్ఫూర్తినచ్చే వజయాన్ని సొంతం చేసుకున్నారని అన్నారు. ప్రధాని మోడీని మంగళవారం ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రపంచ ఛాంపియన్ షిప్ గెలుచుకున్న తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చిన ఆమె తన ఆనందాన్ని ప్రధానితో పంచుకున్నారు. ఈ సందర్భంగా సింధూని మోదీ అభినందించారు. బంగారు పతకాన్ని ఆమె ప్రధాని చేతికి అందివ్వగా.. దాన్ని ఆయన ఆమె మెడలో వేశారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ లో స్వర్ణ పతకం గెలిచి స్వదేశంలో అడుగుపెట్టిన తెలుగు తేజం పీవీసింధుకు ఘన స్వాగతం లభించింది. సోమవారం రాత్రి దిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆమె నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. ఈ ఉదయం తన నివాసానికి వచ్చిన సింధు, కోచ్ గోపీచంద్‌లను మోదీ అభినందించారు. సింధు మెడలో పసిడి పతకం వేసి సత్కరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశారు. 'బంగారు పతకం సాధించి దేశం గర్వపడేలా చేసిన ఛాంపియన్ సింధు. ఆమెను కలవడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో ఇలాంటి ఎన్నో విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు. భారత స్టార్ క్రీడాకారిణి సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో చరిత్ర సృష్టించింది. ఈ సిరీస్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి క్రీడాకారిణిగా భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించింది.

మోదీని కలిసిన వారిలో సింధుతో పాటు కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజుజు, సీనియర్ కోచ్ గోపీచంద్, సింధు కోచ్ కిమ్ జి హ్యూన్ ఉన్నారు. అంతకు ముందు స్వదేశం చేరిన సింధుకు ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఘనస్వాగతం లభించింది. ప్రధానిని కలిసే ముందు కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజును షట్లర్ సింధు కలిసింది. స్విట్జర్లాండ్‌లో జరిగిన వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన సింధు సోమవారమే ఢిల్లీకి వచ్చింది. అక్కడ మంగళవారం ఇవాళ కిరణ్ రిజిజును కలుసుకున్నది. పీవీ సింధు సాధించిన ఘనతను మంత్రి మెచ్చుకున్నారు. తొలిసారి వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సాధించిన భారత క్రీడాకారిణిగా సింధు దేశ గౌరవాన్ని పెంచిందన్నారు. దేశానికి ఆమె మరిన్ని పతకాలు అందించాలంటూ మంత్రి తన ట్విట్టర్‌లో ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదిలావుంటే భారత్ నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు కేంద్ర క్రీడల శాఖ 10లక్షల నజరానా ప్రకటించింది. క్రీడల శాఖ మంత్రి కిరణ్ రిజిజును సింధు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రిజిజు సింధును అభినందించారు. ఆమెకు పది లక్షల చెక్కును ప్రదానం చేశారు. స్విట్జర్లాండ్‌లోని బోసెల్‌లో ఆదివారం జరిగిన ÷నైల్ వార్‌ను సింధు వన్‌సైడ్ చేసిన సంగతి తెలిసిందే. పదునైన స్మాష్‌లు, డ్రాప్ షాట్లతో విరుచుకుపడుతూ ప్రత్యర్థి ఒకుహారను ఉక్కిరిబిక్కిరిచేసింది. కేవలం 38 నిమిషాల పాటు జరిగిన ÷నైల్లో ఒకుహారపై సింధు వరుస గేముల్లో 21-7, 21-7తో విజయభేరి మోగించింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సింధుకు ఇది ఐదో పతకం! ఈ ఈవెంట్‌లో ఐదు పతకాలు కొల్లగొట్టిన రెండో క్రీడాకారిణిగా చైనా షట్లర్ జాంగ్ నింగ్ సరసన నిలిచింది. సింధువెంట గోపీచంద్‌తో పాటు ఆమె తండ్రి రమణారావు కూడా ఉన్నారు.

## బైకును ఢీకొన్న టిప్పర్: విద్యార్థి మృతి

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆంఎన్ఎ): బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలోని బాలంరాయి వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. తాడ్ బండ్ నుండి ప్యారడైజ్ వైపు వెళ్తున్న బైకును వెనుక నుండి వేగంగా వచ్చిన ఓ గుర్తుతెలియని టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై వెళ్తున్న నితీష్ అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. నితీష్ తెలంగాణ ఏవియేషన్ అకాడమీలో విద్యార్థిగా శిక్షణ తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. టిప్పర్ వాహనం వేగంగా రావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టువర్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహనాన్ని వెతికే పనిలో ఉన్నారు.




ఎంపి సంతోశ్ కుమార్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌తో మొక్కనాటిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

# విస్తరిస్తున్న ఎంపి సంతోష్ కుమార్ గ్రీన్ ఛాలెంజ్

### మొక్కలు నాటిని కవిత, మంత్రి ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఛాలెంజ్ ఉద్యమం రోజురోజుకు వేగంగా విస్తరిస్తున్నది. ఎంపీ సంతోష్ కుమార్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్ ను స్వీకరించిన ఆయన సోదరి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత మంగళవారం తన నివాసంలో మూడు మొక్కలు నాటారు. గ్రీన్ ఛాలెంజ్ ఉద్యమం కొనసాగుతున్న తీరుపై కవిత సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎంపీ సంతోష్ కుమార్ విసిరిన ఛాలెంజ్ ను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా మినిస్టర్ క్వార్టర్స్ లోని రెసిడెన్స్ లో మంత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మంత్రి వేముల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే షకీల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణెశిష్ గుప్తా కు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ విసిరారు.

# రైతు పొలలు పచ్చగా ఉంటే తట్టుకోలేని కాంగ్రెస్

### కాళేశ్వరంపై నేతల తప్పుడు ప్రచారాలు
### ప్రజలు బుద్ది చెప్పినా మారని కాంగ్రెస్ నేతలు
### అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్
### టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు సమీక్షలో కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆంఎన్ఎ): తెలంగాణ రైతుల పొలాలు పచ్చగా అవుతుంటే కాంగ్రెస్ నేతల కళ్లు ఎర్రబడుతున్నాయి అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. వారికి అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి గిట్టలేకపోతున్నారని అన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణం కావాలన్నదే సిఎం కెసిఆర్ కల అని కెటిఆర్ చెప్పారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు చెప్పారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ్‌భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జూబ్లీహిల్స్ టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయోత్సవసభ నిర్వహించారు. ఈ సభలో కేటీఆర్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు విచక్షణ లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నేతలు తుమ్మిడి హట్టిలో నాటు పడవ ఎక్కి నాటు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పినా కాంగ్రెస్ నేతలు మారటం లేదని విమర్శించారు. తెలంగాణలోనే కాకుండా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీ లలో చేరుతున్నారని దుయ్యబట్టారు. ఇతర పార్టీల నాయకుల మాటలను పట్టించుకోవద్దని కార్యకర్తలకు సూచించారు. దేశంలో ఆ పార్టీ పరిస్థితి ఏంటో కాంగ్రెస్ నాయకులు ఆలోచించుకోవాలి. కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం లేక ఎక్కడికక్కడ ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ప్రజలు సుభిక్షంగా ఉంటే కాంగ్రెస్ నేతలకు నిద్ర పట్టడం లేదు. ప్రజలు ఛీకొడుతున్నా కాంగ్రెస్ అవే ఆరోపణలు చేస్తోంది. పేదల పట్ల తాపత్రయం ఉన్న టీఆర్ఎస్ నాయకులను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. ఐదేళ్లలోనే సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశమే అబ్బురపడే విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. కారుచీకట్ల నుంచి 24 గంటలు కరెంట్ ఇచ్చే రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని గుర్తు చేశారు. అందరికీ 24 గంటల విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. 50 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ఏటా పెన్షన్ల కోసం ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు వెచ్చిస్తోంది. హైదరాబాద్‌లో శాంతి, భద్రతలు అద్భుతంగా ఉన్నాయి. గతంలో గణెశిష్ పండుగ వస్తే కర్ఫ్యూ విధించేవాళ్లు. ఇప్పుడు కర్ఫ్యూలు లేకుండా శాంతి భద్రతలను అద్భుతంగా నిర్వహిస్తున్నారు. నగరంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాం. గతంలో ఎండాకాలం వస్తే జలమండలి కార్యాలయం ముందు ప్రదర్శనలు జరిగేవి. నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. గతంలో నిజాంపేట, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో 14 రోజులకోసారి నీళ్లు వచ్చేవి. ఇప్పుడు నిజాంపేట, కుత్బులాపూర్‌లో రెండు రోజులకోసారి నీళ్లిస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. ఇకపోతే 10 లక్షల కెమెరాలతో హైదరాబాద్ నగరాన్ని సేఫ్ సిటీగా చేయబోతున్నట్టు కెటిఆర్ తెలిపారు. అమెజాన్, గూగుల్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. గత గ్రేటర్ ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేర్చి హైదరాబాద్ ప్రజల రుణం తీర్చుకుంటామని ఆయన వెల్లడించారు. సభా ప్రాంగణంలో టిఆర్ఎస్ జెండాను కెటిఆర్ ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకంలో తెలంగాణ దూసుకెళుతుందని కెటిఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బిజెపిలు తట్టుకోలేకపోతున్నాయని, అందుకే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దేశం తెలంగాణ వైపు చూసేలా అభివృద్ధి చేస్తూ, అవినీతి లేని పాలనను సీఎం కేసీఆర్ అందిస్తున్నారన్నారు. ఇతర పార్టీల నేతలు 20 సంవత్సరాలలో చేసే పనులను 5 సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. తెలంగాణ వచ్చాక ఏ విధంగా నడుపుతారనే సందేహం చాలా మందికి ఉండేదని, కానీ కెసిఆర్ సీఎం అయిన 6 నెలల్లోనే 24 గంటల కరెంట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఎండాకాలం వచ్చిందంటే బిందెలతో జలమండలి ముందు కూర్చునే వారని, ఇపుడు ఆ సమస్య లేదని పేర్కొన్నారు. హైదరాబాద్ లో రోజు తప్పి రోజు నీళ్లు వస్తున్నాయంటే అది కేసీఆర్ ఘనతేనన్నారు. హైదరాబాద్ లో మెట్రో రైల్ ప్రాజెక్టు తో పాటు, యువతకు కొలువులు ఇచ్చే కార్యక్రమాలను చేస్తూ ముందుకి వెళుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు టిఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 50 లక్షల మందికి 2 వేల 116 రూపాయల పెన్షన్ ఇస్తున్నామని, దివ్యాంగులకు 3 వేల 116 రూపాయల పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సంక్షేమ పథకాలకు కేంద్రం ఇస్తున్న మొత్తం నామమాత్రమేనన్నారు. హైదరాబాద్ లో 10 లక్షల సి సి కెమెరా లు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ కి అంతర్జాతీయ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. పేదలకు త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని అన్నారు. హైదరాబాద్ ప్రజలను సంతృప్తి పరిచి ఋణం తీర్చుకుంటామని తెలిపారు. ప్రత్యర్థులు ఎక్కడ మాట్లాడినా తిప్పి కొడుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఎల్ఎలు మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేశ్, ఎంఎల్‌సిలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మన శౌకర్యము కొరకై
తన వంతుగ సేవల నిడి తనిసిన జ్ఞానిన్
ఘనుడగు "ఎమ్జీకే మీ
నను" గారికి శిరము వంచి నతులందింతున్ !!

( ఆగష్టు 28 శాస్త్రజ్ఞుడు ఎం.జీ.కే. మీనను జననం) -రాధశ్రీ

సెల్: 9494481210

## బంజారాహిల్స్‌లో భారీ చోరీ

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ):హైదరాబాద్‌లో భారీ చోరీ జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో నివాసముంటున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి అన్న కుమారుడు ఉత్తమ్‌రెడ్డి ఇంట్లో దాదాపు రూ.2 కోట్ల విలువైన సొత్తును దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన వాటిలో విలువైన వజ్రాలు, బంగారం, నగదు ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు కూపీ లాగుతున్నారు.

## అంతరిక్ష కేంద్రానికి రోబో

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి స్కైబోట్ ఎఫ్-850 రోబో చేరుకున్నది.

మానవరహిత వ్యోమనౌక ఇవాళ ఉదయం ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు అనుసంధానమైంది. మంగోలియాకు 250 మైళ్ల ఎత్తులో ఆ డాకింగ్ జరిగింది. ఆ వ్యోమనౌకలో రష్యాకు చెందిన హ్యూమనాయిడ్ రోబో ఉన్నది. సోయేజ్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఆ రోబో ప్రయాణించి వెళ్లింది.

గత రాత్రి 11 గంటలకు డాకింగ్ జరిగినట్లు నాసా తన ట్విట్టర్‌లో చెప్పింది. సోయేజ్ వ్యోమనౌకలో రోబోతో పాటు 1450 పౌండ్ల బరువైన కార్గో కూడా ఉన్నది. ప్రస్తుతం అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో ఎక్స్‌పడీషన్ 60కి చెందిన వ్యోమగాములు ఉన్నారు.

## కుమార్తెను అంతమొందించబోయిన తల్లి

### దేహశుద్ధి చేసిన స్థానికులు

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆంఎన్ఎ): నగరంలోని కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కుమార్తెను కన్న తల్లే బస్సు కిందకే తోసేసింది. బస్సు డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ఆ తర్వాత మళ్లీ చిన్నారిని రోడ్డుపై విసిరేసింది. చిన్నారిని స్థానికులు కాపాడారు. కసాయి తల్లిని స్థానికులు చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

### అదుపుతప్పిన ట్రక్కుల
### 16మంది మృతి




ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో అదుపుతప్పిన ట్రక్కు రెండు వాహనాలను ఢీకొట్టిన దృశ్యం

లక్నో,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ట్రక్కు అదుపుతప్పి రెండు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో 16 మంది దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 24వ నంబరు జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తున్న ఓ ట్రక్కు షాజహాన్‌పూర్‌లోని జంకా క్రాసింగ్ వద్ద అదుపుతప్పి ముందు వెళుతున్న ఓ టెంపో, వ్యాన్‌ను ఢీకొట్టింది. ట్రక్కు వేగం కారణంగా వ్యాన్ రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. క్షణాల్లోనే ట్రక్కు కూడా వ్యాన్‌పై బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లోని 16 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

## కశ్మీర్‌లో ఉనికిని చాటుకునే ఉగ్రచర్య

### ఇద్దరు గుజ్జర్లను పొట్టన పెట్టుకున్న జైషే మహ్మద్

శ్రీనగర్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ తన ఉనికిని చాటుకునే దుశ్చర్యకు పాల్పడింది. పుల్వామా జిల్లా అటవీ ప్రాంతం నుంచి గుజ్జర్ కులానికి చెందిన ఇద్దరు యువకులను సోమవారంనాడు అపహరించి, నిర్దాక్షిణ్యంగా వారి ప్రాణాలు తీసింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న 370 అధికరణ రద్దు తర్వాత చోటుచేసుకున్న తొలి ఉగ్రచర్యగా దీనిని చెబుతున్నారు.

పోలీసుల కథనం ప్రకారం, పుల్వామా జిల్లా థోక్ ఏరియాలోని తాత్కాలిక శిబిరం నుంచి సోమవారం రాత్రి 7.30 గంటలకు అబ్దుల్ ఖదీర్ కోహ్లి (రాజౌరీ జిల్లావాసి), మన్జూర్ అహ్మద్ (శ్రీనగర్ వాసి)ను గుర్తుతెలియని సాయుధులు కిడ్నాప్ చేశారు. దీంతో బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బుల్లెట్లతో ఛిద్రమైన కోహ్లి మృతదేహాన్ని ఇంతకుముందే స్వాధీనం చేసుకున్న బలగాలు, ఆ తర్వాత అహ్మద్ మృతదేహాన్ని కూడా కనుగొన్నారు. గుజ్జర్ యువకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాద గ్రూపును మట్టుబెడతామని జమ్మూకశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్ తెలిపారు. ఆగస్టు 5న కేంద్ర నుంచి ఆర్టికల్ 370 రద్దు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన ప్రకటన తర్వాత జరిగిన తొలి ఉగ్రదాడిగా దీనిని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈనెల 20న బారాముల్లాలో చోటుచేసుకున్న తొలి ఎన్‌కౌంటర్‌లో ఒక లష్కరే తొయిబా ఉగ్రవాది, ప్రత్యేక పోలీసు అధికారి మృతి చెందగా, ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ గాయపడ్డాడు.

# ఇదో చారిత్రక పునరావృత్తి...

నేటినిజం
బుధవారం 28-8-2019

మహాత్మాగాంధీ సార్ధ శత జయన్తి– నూటయాబయ్యవ జయన్తి– వత్సరంలో ఆయన ప్రబోధించిన 'వికేంద్రీకృత'ప్రగతికి విరుద్ధమైన 'ప్రగతి భ్రాంతి' దేశమంతటా వ్యాపిస్తోంది. చిల్లర వ్యాపారంలో, పంపిణీ రంగంలో, ఆవకాయలను అన్నాన్ని సరఫరాచేసే రంగంలో 'అమెజాన్'వంటి విదేశీయ సంస్థల చొఱబాటు 'వికేంద్రీకరణ'కు విరుద్ధమైన భారీ కేంద్రీకరణ.. మహాత్మాగాంధీ వికేంద్రీకృత గ్రామ స్వరాజ్యం గురించి, బ్రిటన్ వాణిజ్య బీభత్సకారులు ధ్వంసం చేసిన భారతీయ ఆర్థిక పునరుద్ధరణ గురించి ప్రచారం చేశాడు. కానీ బ్రిటన్ దురాక్రమణ ముగిసిన తరువాత దశాబ్దుల తరబడి 'కేంద్రీకృత' పారిశ్రామిక, వాణిజ్య విధానాలను మన ప్రభుత్వాల వారు అమలుజరిపారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో మిగిలి ఉండిన వృత్తులు కూడ నశించిపోయి గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. పట్టణాల నగరాల జనాభా పది రెట్లుగా పెరిగిపోయింది– ఈ జనాభా కేంద్రీకరణ వల్ల కాలుష్యం కేంద్రీకృతం అయింది. దోమల ప్రమాదం కేంద్రీకృతమైపోయింది. ప్రపంచీకరణ వచ్చిపడిన తరువాత 'కేంద్రీకరణ' విదేశీయ వాణిజ్య సామ్రాజ్యంగా విస్తరించింది. ఇదంతా గతంలో బ్రిటన్‌వారు ఐరోపావారు ఆరంభించిన వాణిజ్య సామ్రాజ్య బీభత్స వ్యవస్థకు పునరావృత్తి! రెండు సంస్థలు మాత్రమే చిల్లర వ్యాపారాన్ని, ప్రత్యేకించి అంతర్జాల– ఇంటర్‌నెట్– ప్రసార– ఆన్‌లైన్– వ్యాపారాన్ని కొల్లగొట్టగలిగినప్పటికీ కనీసం అవి 'భారతీయ సంస్థలు' కూడ కావు. 'అమెజాన్' 'వాల్‌మార్ట్' రెండూ విదేశీయ సంస్థలు. ఈ రెండు సంస్థలూ తోడేలువలె గుంటనక్కవలె మన దేశంలోకి చొరబడినాయి. స్వదేశీయ సంస్థలను దిగమింగి వేస్తున్నాయి. 'యాప్‌కార్ట్'ను 'వాల్‌మార్ట్' ఆక్రమించుకోవడం ఒక ఉదాహరణ మాత్రమే!!

ఇదంతా సంపన్న దేశాలవారు ప్రవర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న వాణిజ్య బీభత్సకాండ, ఆర్థిక దురాక్రమణ. ఒకే మతం ప్రపంచమంతటా పాదుకోవాలని, మిగిలిన మతాలను నిర్మూలించాలని భావించడం మతోన్మాదం. అలాగే ఒకే భాష ప్రపంచమంతటా ప్రబలిపోవాలని భారతీయ భాషలు, ఇతర వర్ధమాన దేశాల భాషలు అంతరించాలని భావించడం భాషా ఉన్మాదం. వైవిధ్యాలను ధ్వంసం చేసి 'ఏకరూపత'ను సాధించాలనడం భావోన్మాదం. ఈ ఉన్మాదులు శతాబ్దుల తరబడి భౌతిక బీభత్సకాండను, బౌద్ధిక బీభత్సకాండను కొనసాగించారు. అలాగే తమ సంస్థ మాత్రమే మిగిలి, మిగతా వ్యాపార సంస్థలు, పారిశ్రామిక సంస్థలు మూతపడిపోవాలన్న వాంఛ ఆర్థిక ఉన్మాదం. అమెజాన్, వాల్‌మార్ట్ వంటి సంస్థలవారు ఇలాంటి ఆర్థిక ఉన్మాదులు... వీరి 'విస్తరణ' వాణిజ్య బీభత్సం! క్రీస్తుశకం పదహారవ శతాబ్దినుంచి ఐరోపా వాణిజ్య బీభత్సకారులు మన దేశంలోకి చొరబడడం చరిత్ర. ప్రపంచంలోని అనేక దేశాలను కూడ ఈ 'వాణిజ్య బీభత్సకారులు' కొల్లగొట్టడం మొదలైంది. ఐరోపా దేశాల మధ్య పోటీ మొదలుకావడం ఆ శతాబ్దినాటి సమాంతర బీభత్స పరిణామం. ఈ వాణిజ్య యుద్ధం బ్రిటన్‌కూ ఫ్రాన్స్‌కూ మధ్య పరాకాష్ఠకు చేరడం క్రమానుగత పరిణామం. పోర్చుగల్, హాలెండ్, నెదర్‌లాండ్స్ కంపెనీలను మన దేశం నుంచి వెళ్లగొట్టి బ్రిటన్, ఫ్రాన్స్‌లు విస్తరించడం చరిత్ర. చివరికి ఫ్రాన్స్ సంస్థలను సైతం వెళ్లగొట్టి బ్రిటన్‌వారి 'ఈస్టిండియా' వాణిజ్యపు ముఠా మన దేశాన్ని దోచుకోగల ఏకైక తస్కర ముష్కర బృందంగా అవతరించింది. ఈ 'ఏకాధిపత్యం' సాధించడానికి వీలుగా 'ఈస్టిండియా కంపెనీ' ఫ్రాన్స్‌కు పుదుచ్చేరిని వదిలిపెట్టింది. దొంగలు ఊళ్లు పంచుకున్నారు. పుదుచ్చేరికి బదులు బ్రిటన్‌కు కెనడాలోని 'క్యూబెక్'ప్రాంతం దక్కింది. ఈ వాణిజ్య బీభత్సం రాజకీయ బీభత్సంగా స్థిరపడింది. మన దేశం బ్రిటన్‌కు 'బానిస'గా మారింది. ఈ బానిసత్వాన్ని వదిలించుకొనడానికై మన దేశం తొంబయి ఏళ్లు సాయుధ సమరాన్ని, సత్యాగ్రహ ఉద్యమాన్ని జరుపవలసి వచ్చింది! అమెరికా ప్రస్తుతం ఐరోపావారి దోపిడీ వారసత్వానికి ప్రధాన ప్రతినిధి. అందువల్ల పదిహేడవ శతాబ్దినాటి 'ఈస్టిండియా కంపెనీ' స్ఫూర్తితో 'అమెజాన్' మన దేశంలోకి చొఱబడి ఉంది, 'వాల్‌మార్ట్' విస్తరించిపోతోంది. వీటి ధాటికి తట్టుకోలేక 'కారీఫోర్'వంటి ఫ్రాన్సీయ సంస్థలు పలాయనం చిత్తగించడం చారిత్రక పునరావృత్తి.

# క్రీడారంగాల్లో ప్రోత్సాహకాలు పెరగాలి

## ఆడపిల్లల తల్లిదండ్రులను వెన్నుతట్టాలి

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ ఇచ్చిన బేటీ బచావో...బేటీ పడావో..నినాదానికి ఎందరో స్ఫూర్తిగా నిలుస్తారు. అలాంటి వారిని చూసి ప్రోత్సహిస్తే దేశంలో ఆడపిల్లపై అకృత్యాలు లేదా, అఘాయిత్యాలు జరగవు. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, పివి సింధు,సాక్షి ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మనదేశంలో తమ పిల్లలు అడపిల్లలని చూడడం లేదు. వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు వెనకాడడం లేదు. ఎందరో ఆడపిల్లల తల్లిదండ్రుల తమ పిల్లలను అతి కష్టం మీద చదివిస్తున్నారు. వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి వారికి కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించాలి. ఫీజులు, విద్యా రుణాలు,క్రీడాంశాల్లో రాయితీలు ఇవ్వాలి. ఇలాంటి తల్లిదండ్రలును ప్రోత్సహించేందుకు సింధు విజయాన్ని ఓ స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పుడే ప్రధాని మోడీ ఇచ్చిన బేటీపడావోకు అర్థం ఉంటుంది. సింధుకి తల్లిదండ్రులే మొదటి గురువులు. తండ్రి పీవీ రమణ జాతీయ వాలీబాల్ ఆటగాడు, తల్లి జాతీయ స్థాయిలో వాలీబాల్ క్రీడాకారిణి. ఈ నేపథ్యం, ఇంట్లో వాతావరణం సింధును సహజంగానే ఆటలపై మనసు మళ్లేలా చేసింది. రెండు వేల సంవత్సరంలో రమణకు అర్జున అవార్డు వచ్చిన సందర్భంగా ఐదేళ్ల ప్రాయంలో ఉన్న సింధు ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ స్ఫూర్తి పొందిన సింధు ఇంటి పక్కన చిన్నారులతో బ్యాడ్మింటన్ ఆడడం మొదలు పెట్టింది. ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు దగ్గర్లోని రైల్వే శిక్షకుడి వద్ద చేర్పించారు. ఏడాది తర్వాత మెరుగైన శిక్షణ కోసం ఇంటికి 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపీచంద్ అకాడమీలో చేర్పించారు. ఇలా కొన్నేళ్లుగా బ్యాడ్మింటన్ తర్ఫీదుని కొనసాగిస్తున్న సింధు ఎవరెస్ట్ శిఖరం లాంటి ఒలంపిక్స్ దశకు చేరుకుంది. ఒకవైపు ఆటల్లో.. మరోవైపు చదువులో రాణించడ మంటే కత్తిమీద సామే అయినా సింధు రెండింట్లోనూ సత్తా చాటింది. సబ్జెక్టును బట్టీ పట్టకుండా అర్థమయ్యే రీతిలో తల్లి పాఠాలు చెప్పేది. దీనికి తోడు సింధుకు జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండడం వల్ల చదువులోనూ రాణించేదని ల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పడం విశేషం. ఒలింపిక్స్‌లో కాంస్యం, ఎన్నో సూపర్ సిరీస్‌లు, మరెన్నో గ్రాండ్ ప్రి టైటిళ్లు సొంతం చేసుకున్న సైనా నెహ్వాల్ భారత బ్యాడ్మింటన్ స్టార్. ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం సైనా పోరాడుతున్న రోజుల్లో రాకెట్‌లా దూసుకొచ్చిన సింధు... ఆ ఘనతను పోటీ పడ్డ తొలిసారే కైవసం చేసుకుంది.

ఈ ప్రత్యేకతతో ఒక్కసారిగా భారత బ్యాడ్మింటన్‌కు పర్యాయపదంగా మారిన సైనా సరసన చేరింది. అమ్మానాన్నలు వాలీబాల్ క్రీడాకారులైనా సింధు బ్యాడ్మింటన్‌ను ఎంచుకుంది. సింధు అక్క దివ్య జాతీయ నెట్‌బాల్ క్రీడాకారిణి. అయితే క్రీడాకారుల కుటుంబం నుంచి వచ్చిన సింధు తండ్రిని మించిన తనయ అని నిరూపించుకుంది.

సింధు తండ్రి పీవీ రమణ జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడిగా 39 ఏళ్లకు అర్జున అవార్డు అందుకోగా... సింధు 18 ఏళ్లకే దాన్ని సాధించింది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సింధు రికార్డు సృష్టించింది. ఆడింది.. ప్రపంచ నెంబర్ వన్ క్రీడాకారిణి, కఠిన ప్రత్యర్థి కరోలినా మారిన్ (స్పెయిన్)తో బంగారు పతకం కోసం తన శక్తికి మించి పోరాడింది. ఆమె ఆట చూడాలని దేశవ్యాప్తంగా అనేక చోట్ల అతి పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకాలతో యువత అక్కడికి చేరి ఒక్కటయ్యారు. లండన్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున మొట్టమొదటి బ్యాడ్మింటన్ కాంస్యం నెగ్గిన ఘనత సైనా నెహ్వాల్‌ది.

మెరుగైన ఆటతీరుతో దేశానికి ఒలింపిక్ రజతం సాధించిన మొట్టమొదటి భారతీయ క్రీడాకారిణిగా సింధు తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంది.

లండన్ ఒలింపిక్స్ రజత పతక విజేత యిహాన్ వాంగ్‌ను క్వార్టర్ ఫైనల్ దశలో మట్టి కరిపించింది. ప్రపంచ అగ్రశ్రేణి క్రీడాకారిణి కరొలినా మారీన్ (స్పెయిన్)ను కంగు తినిపించడంలో సింధు విఫలమైనా, క్రీడాభిమానుల స్మృతిపథంలో ఇది చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుంది! ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియా నుంచి వరసగా రెండు కాంస్యాలను సింధు మినహా మరెవరూ సాధించలేకపోయారన్నది నిజం. సింధు పట్టుదల ఆధునిక క్రీడారంగాన కొత్త శకారంభానికి నాందిగా మారనుంది. నేటి స్వర్ణం దేశానికే గర్వకారణం. క్రీడల్లో ఆడపిల్లలు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించే వాతావరణం ఉందని సింధు తల్లిదండ్రులు నిరూపించారు. ఆడపిల్లలయినా ఇద్దరు కూతుళ్లను వారు క్రీడాకారులుగా తీర్చిదిద్దారు.

# క్రీడా పాలసీతో ప్రోత్సహించాలి

హైదరాబాద్, ఆగష్టు 27:ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు కృషి అభినందనీయం. ఆమె ఎలాంటి ప్రోత్సాహం లేకుండానే రాకెట్ పట్టి ఎంతో కఠిన దీక్షతో ఈ దశకు చేరుకుంది.ఈ యజ్ఞంలో ఆమె ఎక్కడా తడబాటుకు గురికాకుండా, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా అప్రతిహతంగా ముందుకు సాగిన తీరు అభినందనీయం. ఇంతటి ఘనకీర్తి సాధించడానికి వ్యక్తిగతంగా ఆమె కష్టపడితే ఆమె కష్టానికి తల్లిదండ్రులు, కోచ్ పుల్లెల గోపీచంద్ తోడ్పడ్డారు. అయితే ఆర్థికంగా కూడా ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడినా స్వర్ణం గెలవడం సింధుకు ఇదే తొలిసారి. గతంలో వరుసగా రెండేళ్లు సెమీ ఫైనల్ చేరి కాంస్య పతకాలతోనే సరిపెట్టుకుని, ఆ తర్వాత వరుసగా రెండేళ్లు ఫైనల్ చేరినా రజత పతకానికే పరిమితమైంది. రెండేళ్ల క్రితం ఇదే టోర్నీలో,ఇదే ప్రత్యర్థి చేతిలో అద్భుతంగా పోరాడి ఓడింది. సింధు ఓడినా ఆమె పోరాడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఆమె మీద ఎంతో భరోసానిచ్చిన ప్రదర్శన అది. పక్కా ప్రణాళికతో సిద్ధమై అనుకున్నది సాధించి, విశ్వకిరీటాన్ని అందుకొన్న తొలి భారత క్రీడాకారిణిగా గణుతికెక్కింది. ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలతో చైనా దిగ్గజ షట్లర్ వాన్ జింగ్ సరసన చోటు దక్కించుకుంది. 'రియో'తో మొదలైన జోరును ఇంకా కొనసాగిస్తున్న సింధు ప్రపంచ టోర్నీ స్వర్ణంతో తన స్థాయిని మరింత పెంచుకుంది. నిజానికి రియోలో ఒలంపిక్స్‌లో సింధు రజత పతకం, సాక్షి కంచు పతకం సంపాదించడంతో భారత్ పరువు నిలిపారు. అయితే ఒలంపిక్స్ పట్టికలో మనం ఎప్పుడూ కింది నుంచి ఫస్ట్ ఉండడానికి ప్రయత్నిస్తున్నాం. ఓట్ల కోసం పథకాలు కాదు, క్రీడా పతకాలు రూపొందించాలి. అందుకు క్రీడా పాలసీని పాటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచే ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా సాగాలి. ఇవాళ సింధులాంటి వారు పతకాలు సాధించారంటే అందులో ప్రభుత్వాల ఘనకార్యం ఏమీ లేదు. వారు తమ సొంతంగా ఆట నేర్చుకుని మన పరవును నిలబెట్టేందుకు ప్రయత్నించారు. నిజానికి ముందునుంచే ప్రభుత్వాలు వీరిని ప్రోత్సహించి ఉంటే బంగారు కొండల్లా మెరిసేవారు. బేటీ బచావో..బేటీ పడావో నినాదంగా మారరాదు. సింధును స్ఫూర్తిగా తీసుకుని ఆడపిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆడపిల్లల క్రీడలకు, విద్యకు ఉచిత సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వాలి. అలా చేయడం ద్వారా సింధు లాంటి ఎందరినో తయారు చేసుకోవాలి. ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన సింధు సాధించిన విజయంతో దేశంలో బ్యాడ్మింటన్‌కు మరింత ఊపు వస్తుందనడంలో సందేహం లేదు. సింధు గెలిచిన స్వర్ణపతకం దేశంలో షటిల్ విప్లవానికే కాకుండా క్రీడా విప్లవానికి, ప్రభుత్వాలు కళ్లు తెరవడానికి తెరతీయాలని కోరుకుందాం. ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్ బ్యాడ్మింటన్ పట్ల మక్కువ పెంచుకోవడంతో ఇప్పుడు దీనికి ఆదరణ పెరగగలదు. గత కొన్నేళ్లలో బ్యాడ్మింటన్ అంచెలంచెలుగా ఎదిగి, ఆదరణ పెంచుకుని.. ఇప్పుడు దేశంలో లక్షల మంది ఆ ఆట ఆడేందుకు ముందుకొచ్చేలా.. కోట్ల మంది కీలక మ్యాచ్‌లను వీక్షించేలా చేయగలిగింది. ఇందులో పుల్లెల గోపీచంద్ పాత్ర అత్యంత కీలకం. బ్యాడ్మింటన్ బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేశాడు గోపీచంద్. దశాబ్దం కిందట అతను నెలకొల్పిన అకాడమీ ఇప్పుడిప్పుడే వేళ్లూను కుంటోంది. సైనా రూపంలో ప్రపంచ స్థాయి క్రీడాకారిణిని తీర్చిదిద్ది.. దేశంలో బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన ఘనత గోపీచంద్‌ది. ద్రోణాచార్య లాగా తర్ఫీదు ఇచ్చి మెరికల్లాంటి షటిలర్లను తయారు చేస్తున్నాడు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ గొప్ప పురోగతి సాధించింది. సైనాకు తోడు సింధు, కశ్యప్, జ్వాల, అశ్విని లాంటి క్రీడాకారిణులు కూడా ప్రపంచ స్థాయికి ఎదగడంతో రాకెట్‌కు మరింత ఊపొచ్చింది. ఇప్పటిదాకా భారత బ్యాడ్మింటన్‌లో సాధించిన పురోగతి అంతా ఒక ఎత్తయితే.. ఇప్పుడు సింధు స్వర్ణం గెలవడం మరో ఎత్తు. ఇప్పటికే ఆడేందుకు, చూసేందుకు మంచి ప్రత్యామ్నాయంగా మారిన బ్యాడ్మింటన్‌పై ఆసక్తి రెట్టింపవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఈ స్ఫూర్తి కొనసాగాలంటే, మరిన్ని పతకాలు రావాలంటే ప్రభుత్వాల క్రీడా విధానాంలో మార్పుల రావాలి. కోచ్‌లను,క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకే చైనా తరహాలో భారత్ ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి. సింధు మ్యాచ్‌లను చూసినప్పుడు కలిగిన అనుభూతి ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు. భారత బ్యాడ్మింటన్ రంగాన సరికొత్త చరిత్ర సృష్టించిందనే చెప్పాలి.

# తదుపరి లక్ష్యం 2020 టోక్యో ఒలంపిక్స్ లక్ష్యం

## దీక్షతో పాటు కఠోర పరిశ్రమ సింధు సొంతం

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అద్భుతం చేసి చూపింది.స్విట్జర్లాండ్‌లోని బాసెల్ వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జగజ్జేతగా అవతరించి, భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్రకు నాంది పలికింది. జపాన్ క్రీడాకారిణి నొజొమి ఒకుహరను ఫైనల్లో ఓడించిన సింధు కోట్లాది భారతీయులను సంతోషంలో ముంచెత్తి, దేశం గర్వించేలా చేసింది. వరుసగా మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తుదిపోరుకు చేరిన ఈ తెలుగుతేజం, తన పసిడి కల సాకారం చేసుకొని, అందరినీ స్వర్ణ సంబరంలో ముంచెత్తింది. ఇతర క్రీడాకరులకు ఇప్పుడు ఆమె స్ఫూర్తి. కఠోర శ్రమతో విజయాలు సాధించవచ్చని నిరూపించింది. ఆటలో.. ఫిట్‌నెస్‌లో మిగతా క్రీడాకారిణులకు అందనంత ఎత్తుకు చేరుకున్న సింధు ఒక్కరోజులో ఈ స్థాయికి చేరుకోలేదు! కఠోర శ్రమ.. అంకితభావం.. పట్టుదలే సింధును సమున్నత స్థానంలో నిలబెట్టాయి. సింధు సాధించిన తాజా పతకం వెనుక పెద్ద ప్రణాళికే ఉంది. ఒకప్పుడు భారత బ్యాడ్మింటన్ అనగానే అందరికీ గుర్తొచ్చేది ప్రకాశ్ పదుకోన్, పుల్లెల గోపీచంద్. ఆ తర్వాత వీరి వారసత్వాన్ని అందిపుచ్చుకొని సైనా నెహ్వాల్ అంతర్జాతీయ స్థాయిలో అనేక టైటిళ్లు గెలిచి భారత్ స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. సింధు మరింత విజృంభిస్తూ ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత్‌ను అత్యున్నత స్థాయిలో నిలిపింది. అంతర్జాతీయస్థాయిలో వీరందరి ప్రదర్శన చూస్తుంటే, భారత బ్యాడ్మింటన్ నుంచి టోక్యో ఒలింపిక్స్‌లో కచ్చితంగా మరిన్ని పతకాలు ఆశించ వచ్చునని అనిపిస్తున్నది. 2016లో రియో ఒలింపిక్స్‌లో రజతంతో పూర్తిగా సింధు జీవితం పూర్తిగా మారిపోయింది. కోహ్లి, ధోని, సచిన్ తర్వాత దేశంలో అత్యధికంగా ఆర్జన కలిగిన క్రికెటేతర క్రీడాకారిణిగా రికార్డు.. పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు. సెలెబ్రిటీగా.. స్టార్‌గా విస్తృత ప్రచారం. 21 ఏళ్లకే క్రీడాకారుడి జీవితం ఇంతలా మారిపోతే కాస్తోకూస్తో ఏకాగ్రత చెదరడం సహజం! ఏకాగ్రత పక్కదారి పట్టి.. ఆట గాడితప్పడం సాధారణం! ఐతే వీటన్నింటికీ సింధు అతీతం. ఒలింపిక్స్‌లో సింధు రజతం గెలిచి మూడేళ్లయింది. ఇప్పటికీ ఆమె ఏకాగ్రత చెక్కు చెదరలేదు. పైగా పట్టుదల మరింత పెరిగింది. మధ్యలో మరెన్నో మేటి విజయాలు సాధించిన ఆమె.. ప్రతి షట్లర్ కోరుకున్నట్లే తాను కూడా ప్రపంచ ఛాంపియన్ అవ్వాలన్న కసితో సాధనను రెట్టింపు చేసింది. అందరిలా గోపీచంద్ అకాడమీలో సాధన చేస్తూనే.. ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంది. ఇంటికి 30 కిలోమీటర్ల దూరంలో సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీలో ట్రెయినర్ శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో కఠోర శిక్షణ మొదలుపెట్టింది. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సరిగ్గా 27 రోజుల ముందు సింధు ఫిట్‌నెస్ మిషన్ మొదలైంది. సమయం తక్కువున్నా సింధును శ్రీకాంత్ అద్భుతంగా మలిచాడు. సింధు శరీరాకృతికి అనుగుణంగా శిక్షణ ప్రారంభించాడు. కోర్టులో ముందు భాగంలో సింధు బలహీనంగా ఉందని గుర్తించి.. అందుకు తగ్గ కసరత్తులు చేయించాడు. ప్రతిరోజు 60 కిమీ ప్రయాణిస్తూ.. 2 గంటల పాటు ఫిట్‌నెస్‌పై దృష్టిసారించింది సింధు. 2017 ఫైనల్లో నొజొమి ఒకుహర (జపాన్)తో 110 నిమిషాల పాటు హోరాహోరీగా తలపడానికి అదే కారణం. 2017 నుంచి క్రమం తప్పకుండా సాధన.. ఫిట్‌నెస్ కొనసాగిస్తున్న సింధు తాజా ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం ప్రత్యేకంగా సిద్ధమైంది. ఫిట్‌నెస్‌పై 45 రోజుల పాటు తీవ్రంగా కష్టపడింది. ఎంత శ్రమించినా అలసిపోని తత్వం సింధుకు మరింత కలిసొచ్చింది. తండ్రి రమణ, తల్లి విజయ ఇద్దరూ క్రీడాకారులే కావడంతో సింధుకు సహజసిద్ధమైన సామర్థ్యం అబ్బింది. వేగంగా కుదురుకోవడం ఆమెలోని ప్రత్యేకత. అత్యంత తీవ్రతతో కసరత్తులు చేసినా.. వేగంగా పరుగెత్తినా కేవలం 30 సెకన్లలోనే సింధు హృదయ స్పందన రేటు సాధారణానికి వస్తుంది. ఈ ప్రత్యేక లక్షణమే సింధును బ్యాడ్మింటన్ బాహుబలిగా మార్చేసింది. తిరుగులేని ఫిట్‌నెస్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లిన సింధుకు అక్కడ ఎదురే లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ఫిట్‌నెస్ కలిగిన సింధుకు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడం కష్టమేమీ కాకపోవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధుతో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిన మరో తెలుగుతేజం భమిడిపాటి సాయి ప్రణీత్. ఏమాత్రం అంచనాలు లేని ఈ హైదరాబాద్ కుర్రాడు పురుషుల సింగిల్స్‌లో కాంస్య పతకం దక్కించుకొని ప్రకాశ్ పదుకోన్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్‌లాంటి స్టార్ ఆటగాళ్లంతా విఫలమైన చోట ప్రణీత్ అద్వితీయమైన ప్రదర్శన కనబరచాడు. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకంతో భవిష్యత్‌లో మరిన్ని మేజర్ టైటిళ్లు గెలవగల సత్తా ఉందని నిరూపించిన ప్రణీత్ వచ్చే ఏడాది టోక్యో విశ్వక్రీడల్లో భారత్ నుంచి ఫేవరెట్ ఆటగాడు అనడంలో సందేహం లేదు.

# రజకులను ఎస్సీలో చేర్చాల్సిందే

## తమకు న్యాయం కోసం ఆయా వర్గాలు ఎదురు చూపు

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమ సమయంలో రజకులను ఎస్సీలలోకి, కాయితీ లంబాడీలు, వాల్మీకి బోయలు, వడ్డెరలను ఎస్టీలలోకి చేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇప్పుడా హామీఏమయ్యిందని ఆయా వర్గాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ముస్లింల రిజర్వేషన్ల నేపథ్యంలో తమ సంగతేంటని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 6 శాతంఉన్న ఎస్టీ రిజర్వేషన్లను 12శాతానికి పెంచుతామని కూడా అధికారికంగా ప్రకటించింది. అయితే ప్రస్తుతం ఈ విషయం గురించి పెద్దగా మాట్లాడటం లేదు. తమ సామాజిక స్థితిని మార్చుకోవాలని రజకులు, వాల్మీకి బోయలు, కాయితీ లంబాడీలు, వడ్డెరలు దశాబ్దాల కాలంగా చేస్తున్న పోరాటాల గురించి పెదవి విప్పడంలేదు. సమాజంలో నిజంగా అణగారిన వర్గాల వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం అయితే ఈ వర్గాలు కోరుతున్న విధంగా వారిని ఎస్సీ, ఎస్టీ జాబితాల్లోకి చేర్చడంపై కూడా అసెంబ్లీలో చర్చించాలని కోరుతున్నారు. అందరి ఆమోదంతో ఈ వర్గాల గురించి కూడా ఒక నిర్ణయానికి రావాలి. అలాగే టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కూడా హామీ ఇచ్చింది. కానీ ఈ విషయంగా ఇప్పటివరకు ఎవరూ మాట్లాడటం లేదు. సచార్ కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఎప్పుడో అందినా గడిచిన మూడేళ్ల కాలంలో దానిని పట్టించుకోకుండా బుట్టదాఖలు చేశారని కొందరు వాదిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత ఇప్పుడు రిజర్వేషన్ల గురించి హడావిడి చేస్తున్నారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి పొందాలన్న పథకంతోనే తప్ప సమాజంలో అణగారిన ఆ వర్గాల వారికి మేలు చేయాలన్న ఉద్దేశంతో కాదన్నది వారి అభిప్రాయం. వాస్తవానికి తమిళనాడులో ముస్లింలకు 3.5 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఇస్తున్నారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలలో లో 80 శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్నది ప్రభుత్వవాదన. అయితే ఆయా రాష్ట్రాలలో అత్యధికంగా గిరిజనులే ఉంటున్న కారణంగా రాజ్యాంగంలో ఇచ్చిన వెసులుబాటు మేరకు వారికి ఆ రిజర్వేషన్లు ఇవ్వడం జరిగింది. ఇవి కాదనగలమా అని అంటున్నారు. వెనకబాటుకు, సామాజిక వివక్షకు గుర యిన అనేక వర్గాలకు కూడా న్యాయం చేయాలని కోరుతున్నారు.

# దగ్గర పడుతున్న ముహూర్తం

## సిఎం ఆదేశాలతో ఊపందుకున్న పనులు

యాదాద్రి,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): అద్భుతంగా.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సకలసదుపాయాల సముదాయాలు.. గుహారూపంలో దర్శనానికి వెళ్లే మార్గం.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బస్సు టెర్మినల్ ఏర్పాట్లకు యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) సరికొత్త ప్రణాళిక రూపొంది స్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలతో ఆనంద్‌సాయి నేతృత్వంలో నమూనాలు రూపొందాయి. యాదాద్రి సన్నిధిలో అధునాతనంగా ఆరు అంతస్తులతో కూడిన మూడు సముదాయాలు ఆవిష్కృతం కానున్నాయని.. విష్ణు పుష్కరిణిని అభివృద్ధి చేయడంతోపాటు అన్నప్రసాదం అందించే సముదాయం, డార్మిటరీ, విశ్రాంతి ప్రాంగణాలు నిర్మించనున్నట్లు 'యాడా' ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి తెలిపారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి ప్రణాళికపై కెసిఆర్ మార్గదర్శకాల మేరకు ముందుకు సాగుతున్నారు. ప్రధాన ఆలయం.. దర్శన వరుసల సముదాయం మధ్య గుహలాగా దారిని నిర్మిస్తారు. స్వయంభువుల దర్శనానికి వెళ్లాలంటే ఆ గుహ నుంచి వెళ్లాల్సిందే. నరసింహుడి 32 రూపాలను ఆ మార్గంలో పొందుపరిచే ప్రణాళిక సిద్ధమవుతోంది. దర్శన

వరుసల్లో ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. పిల్లలు, వృద్ధులే కాకుండా భక్తులు ఎవరికైనా ఆ సదుపాయం సమకూరనుంది. ఫిబ్రవరిలో లక్ష మంది భక్తులు వచ్చినా స్వామి వారి దర్శనం సులభంగా కల్పించే తీరుతో ప్రత్యేక సముదాయం నిర్మాణం. బస్సు టెర్మినల్ నుంచి క్యూకాంప్లెక్స్‌కు చేరే భక్తులకు తగు వసతులు. దైవదర్శనానికి వెళ్లే భక్తులకు అందులోనే పూజ, ప్రత్యేక దర్శనాల టికెట్లు విక్రయించే కౌంటర్లు ఉంటాయి. ఒక్కో కాంప్లెక్స్‌లో ఆరు వేల మంది భక్తులు కూర్చోవచ్చు. భక్తిభావం కల్పించే ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగుతాయి. ఎప్పటికప్పుడు దర్శన సమాచారం అందిస్తారు.అధునాతన వసతులన్నీ కల్పించి అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో బస్సు టెర్మినల్ భక్తుల కోసం నిర్మితం కానుంది. ఆ సముదాయములోనూ విశ్రాంతి గదులు, దుకాణాలు ఇతర వసతులు ఉంటాయి. ఆ సముదాయం కిందే భక్తుల వాహనాల పార్కింగ్‌కు సెల్లార్లు నిర్మిస్తారు. ఐదు అంతస్థులతో ఏర్పాటయ్యే సెల్లార్‌లో మూడు వేల కార్లను పార్కింగ్ చేయొచ్చు.దివ్యదర్శనం చేసుకున్న భక్తులకు అన్నప్రసాదాన్ని ఉచితంగా అందజేసేందుకు ఇంకో సముదాయంలో ప్రత్యేక వసతి కల్పించనున్నారు. పిల్లల ఆటస్థలం, ముఖ్యులకు దర్శన మార్గాలు, వృద్ధుల సేదకు విశ్రాంతి ప్రాంగణాలు ఏర్పాటవుతాయి. వ్రతాలు జరిపేందుకు విశాలమైన మండపాలు, దీపారాధన ప్రాంగణాలు, విశ్రాంతి, దుకాణాల ప్రాంగణాలను నిర్మిస్తారు. వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు అనుగుణంగా సముదాయాల నిర్మాణం చేపట్టాలన్న సూచనలతో నమూనాలు త్వరలోనే తుదిరూపు దాల్చనున్నాయి. వీటి నిర్మాణాలకయ్యే వ్యయ అంచనాలపై 'యాడా' దృష్టిసారించింది. సిఎంకెసిఆర్ ఇటీవలి సందర్శన తరవాత పనుల్లో వేగం పుంజుకుంది. మహాక్రతువుకు సమయం దగ్గర పడడంతో అందుకు తగ్గట్లుగా పనులు పూర్తి చేస్తున్నారు.

# జల్ జీవన్ మిషన్ పథకానికి మిషన్ భగీరథ స్ఫూర్తి

### దేశానికి ఆదర్శంగా మిషన్ భగీరథ పథకం
### కేంద్రమంత్రి సమక్షంలో రాష్ట్రాల మంత్రుల సమావేశం
### తెలంగాణపై సమగ్ర నివేదిక ఇచ్చామన్న మంత్రి ఎర్రబెల్లి

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథ పథకాన్ని



జలశక్తి బియాన్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

ఆదర్శంగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకాన్ని చేపట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మన పథకం కేంద్రానికి ఆదర్శం కావడం గర్వకారణమని అన్నారు. తెలంగాణలోని మహిళలు తాగునీటి కోసం పడే కష్టాలను తొలగించడంతో పాటు ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చారని, ఇప్పుడీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దేశంలోని ప్రతి ఇంటికీ తాగు నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పథకం అమలుపై రాష్ట్రాల ప్రభుత్వాలతో కేంద్ర తాగునీటి, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ తరఫున మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. సమావేశం ఉద్దేశాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకాన్ని 2024 వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అయితే పథకంపై రాష్ట్రం తరపున సమగ్ర నివేదికను సమర్పించామన్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ని వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా ఉన్న మిషన్ భగీరథ కార్యక్రమం, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం ఒక్కటే కావున నిధుల వరంగా తెలంగాణ ప్రభుత్వానికి కింద.. తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న మిషన్ భగీరథ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని గతంలోనూ కోరామన్నారు. దీనిపై జూన్ 11న ఢిల్లీలోనే మంత్రి షెకావత్‌కు లేఖ ఇచ్చామన్నారు. మిషన్ భగీరథకు సపోర్ట్ చేసేలా 50శాతం నిధులను భరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. మిషన్ భగీరథ నిర్వహణకు ఏటా రూ.2,110 కోట్లు అవసరం అవుతుందని, ఈ నిర్వహణ ఖర్చు మొత్తాన్ని సైతం కేంద్ర ప్రభుత్వం చెల్లించాలని కోరినట్లు తెలిపారు.

నవాకరించాల్సిందిగా కోరామన్నారు. జల్ జీవన్ మిషన్

## నవంబర్ కల్లా ఐటిహబ్ పనులు పూర్తి

### పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ఖమ్మం,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరంలో రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టిన ఐటీ హబ్ మొదటి దశ పనులను నవంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలంగాణ మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ ఎండీ లక్ష్మారెడ్డి తెలిపారు. ఐటీ హబ్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని, ఈ-టవర్‌లో టాన్క్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఎనిమిది సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. మొదటి దశ నిర్మాణంలోనూ స్వల్ప మార్పులు చేయడంతోపాటు ఒక అంతస్తును కూడా పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. ఎకరం స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఐటీ హబ్‌లో 8 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అజయ్‌కుమార్ మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఉప మేయర్ మురళీ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

# రూ.5లకే భోజనం పథకం

### -సూర్యాపేటలో ప్రారంభించిన మంత్రి

సూర్యపేట,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): పట్టణంలో రెండు ప్రాంతాల్లో రూ.5కే అన్నపూర్ణ భోజన కేంద్రాలను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదల కడుపు నింపడంతో అంతులేని ఆనందం ఉందన్నారు. దినసరి కూలీలు, వివిధ పనుల నిమిత్తం సూర్యపేటకు వచ్చేవారికి అన్నపూర్ణ భోజనశాల రూ.5 కే కడుపు నింపుతుంది. ఇంత మంచి దైవ కార్యం చేపట్టిన హరికృష్ణ ఫౌండేషన్ వారికి సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేట పట్టణ వాసులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రోడ్ల వెడల్పు కార్యక్రమానికి కూడా ఈ రోజు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉంది.సూర్యాపేటను సుందరంగా తీర్చి దిద్దేదుకు పట్టణ వాసుల సహకారం మరువలేనిది. సీఎం కేసీఆర్ పిలుపునందుకొని సూర్యాపేటను హరితవవనం చేస్తాం. పట్టణంలో చెట్లను పెంచి పచ్చదనాన్ని పెంపొందిస్తామని తెలిపారు.

# కాశ్మీర్‌కు అండగా ఉంటా

### నోరుపారేసుకున్న మాజీక్రికెటర్ జావేద్ మియాందాద్

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారత్-పాక్ మధ్య నెలకొన్న ఆందోళనకర పరిస్థితులపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ నోరు పారేసుకున్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూనే కశ్మీర్‌ను పాకిస్థాన్ నుంచి ఎవరూ విడదీయలేరంటూ అవగాహనా రాహిత్యంగా వ్యాఖ్యానించారు. అందుకోసం మరికొంత మంది ప్రముఖ క్రీడాకారులతో కలిసి త్వరలో నియంత్రణ రేఖను సందర్శిస్తానన్నారు. శాంతి స్థాపనలో భాగంగా నేను సరిహద్దు ప్రాంతాలకు వెళతాను. క్రీడా రంగంతో పాటు ఇతర ప్రముఖుల్ని ఆహ్వానిస్తాను. శాంతి గురించి అక్కడి వారితో చర్చిస్తాను. ఒకవేళ ఈ చర్యలు ఫలించకపోతే.. నాతో వచ్చేవారితో కలిసి సరిహద్దుకే వెళతాను. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనాల్సిన ప్రాధాన్యతను వివరిస్తాను. శాంతి పతాకాలతో వెళ్లి ఇక్కడి ప్రజలు శాంతికాముకులు అన్న సందేశాన్ని పంపిస్తాను. కశ్మీర్ ప్రజలకు అండగా ఉంటాం. వారిని మా నుంచి ఎవరూ దూరం చేయలేరని మియాందాద్ కశ్మీర్‌పై వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు అన్ని సమస్యల్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానిస్తూనే కశ్మీర్ తమది అనడం ఆయనకే చెల్లింది. ఓవైపు ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనాలంటూనే మరోవైపు కశ్మీర్ అంశంపై అవగాహన లేకుండా మాట్లాడడం పాక్ క్రికెటర్లకు కొత్తేమీ కాదు. ఇటీవల షాహిద్ అఫ్రిదీ సైతం కశ్మీర్‌పై అర్థంలేని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఐరాస జోక్యం చేసుకోవాలంటూ అక్కసును వెళ్లగక్కాడు.

## పంది అడ్డురావడంతో ప్రమాదం: వ్యక్తి మృతి

మహబూబాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): నెల్లికుదురు మండల కేంద్రంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళుతున్న బైక్ కు పంది అడ్డు వచ్చింది. పందిని తప్పించబోయిన క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో బైక్ పై వెళుతున్న కొప్పుల సంజీవరెడ్డి అనే వ్యక్తి చనిపోయాడు. మృతుడు సంజీవరెడ్డి నెల్లికుదురు మండలం కాచికల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. శవ పరీక్ష కోసం సంజీవరెడ్డి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# వాణిజ్య యుద్ధంపై మళ్లీ ఆందోళన

### చైనాతో చర్చిస్తామన్న ట్రంప్

ప్యారిస్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): పరస్పర సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అగ్రదేశాలు అమెరికా, చైనా మళ్లీ చర్చలకు సిద్ధమయ్యాయి. అతి త్వరలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఫ్రాన్స్‌లోని బీయరజ్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు హాజరైన ట్రంప్ అక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'నిన్న రాత్రి చైనా అధికారుల నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మళ్లీ చర్చలు మొదలుపెడతాం అని ఆ దేశం ప్రతిపాదన తెచ్చింది. అతి త్వరలోనే మేం వాణిజ్య చర్చలు జరుపుతాం' అని ట్రంప్ తెలిపారు. చైనా అధికారులు రెండు సార్లు ఫోన్ చేశారని, అమెరికాతో ఒప్పందానికి రావాలని వాళ్లు అనుకుంటున్నారని ట్రంప్ అన్నారు. ఇటీవలే 550 బిలియన్ డాలర్ల చైనా ఉత్పత్తులపై ట్రంప్ సుంకాలు పెంచిన విషయం తెలిసిందే. అమెరికా వస్తువులపై టారీఫ్‌లు విధిస్తున్నట్లు చైనా ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరోసారి రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా.. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం నెలకొంటుందన్న ఆందోళనల నేపథ్యంలో చైనాతో వాణిజ్య యుద్ధం ఆపాలని జీ7 సదస్సు సందర్భంగా మిత్ర దేశాలు ట్రంప్‌నకు హితవు పలికాయి. మరి ఈ యుద్ధానికి రెండు దేశాలు ఇకనైనా స్వస్థి పలుకుతాయో.. లేదో వేచి చూడాలి.

# బెయిల్ కేసులో సిబిఐ కోర్టుకు వచ్చిన గాలి

### సాక్ష్యం ఇచ్చేందుకు వచ్చానన్న నాగమూరుతీ శర్మ

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): బెయిల్ కుంభకోణం కేసులో నిందితుడు గాలి జనార్ధన్‌రెడ్డి అవినీతి నిరోదక శాఖ కోర్టుకు హాజరయ్యాడు. ఈ కేసులో సాక్ష్యం ఇచ్చేందుకు సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి నాగమారుతి శర్మ వచ్చారు. నాగమారుతి శర్మ సాక్ష్యం రికార్డు చేసుకున్న కోర్టు కేసు విచారణను సెప్టెంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఓబులాపురం గనుల మైనింగ్ కేసులో గాలి జనార్ధన్‌రెడ్డిని సీబీఐ కోర్టు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోసం అప్పటి సీబీఐ కోర్టు న్యాయమూర్తి పట్టాబికి లంచం ఇవ్వడానికి ముందు నాగమారుతీ శర్మకు కూడా లంచం ఇవ్వడానికి యత్నించాడని ఏసీబీ కేసు నమోదు చేసింది. లంచం తీసుకుని బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన నాగమారుతీ శర్మ తనకు లంచం ఇవ్వజూపాడని ఏసీబీకి ఫిర్యాదు చేశారు. అప్పట్లో సంచలనం సృష్టించిన మైనింగ్ కింగ్ గాలి జనార్ధన్ రెడ్డి బెయిల్ స్కాం కేసులో సీబీఐ మాజీ జడ్జి నాగమారుతీ శర్మ ఏసీబీ కోర్టులో సోమవారం సాక్ష్యం ఇచ్చారు. జనార్ధన్ రెడ్డి మనుషులు బెయిల్ కోసం లంచం ఇవ్వజూపారని నాగమారుతి శర్మ ఏసీబీ కోర్టులో సోమవారం సాక్ష్యం చెప్పారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డి అరెస్టయ్యాడు. ఆ తర్వాత ఆయన బెయిల్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో... 2012 జూన్ 4వ తేదీన హైద్రాబాద్ కు చెందిన నాచారం యాదగిరి రావు అనే రౌడీ షీటర్‌ను గాలి జనార్ధన్ రెడ్డి మనుషులు కలిశారు. గాలి జనార్ధన్ రెడ్డి కి బెయిల్ కోసం నాచారం యాదగిరి రావు ప్రయత్నాలను ప్రారంభించినట్టుగా సీబీఐ గుర్తించి అరెస్ట్ చేసింది. గాలి జనార్ధన్ రెడ్డి మనుషులు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలోనే అప్పటి సీబీఐ జడ్జి పట్టాబి రామారావు 2012 జూన్ 10వ తేదీన గాలి జనార్ధన్ రెడ్డికి బెయిల్ ఇచ్చారు. అయితే గాలి జనార్ధన్ రెడ్డికి బెయిల్ లభించడంపై సీబీఐ విచారణ జరిపింది. ఈ విచారణలో బెయిల్ స్కాం వెలుగు చూసింది. నాచారం యాదగిరి రావుతో పాటు పలువురిని ఆ సమయంలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలోనే ఆ సమయంలో సీబీఐ జడ్జిగా ఉన్న నాగమారుతి శర్మను గాలి జనార్ధన్ రెడ్డి మనుషులు కలిశారు. బెయిల్ కోసం నాగమారుతి శర్మతో సంప్రదింపులు జరిపారు. ఈ విషయమై ఏసీబీ కోర్టులో సోమవారం నాడు నాగమారుతీ శర్మ సాక్ష్యం చెప్పారు. బెయిల్ ఇస్తే తనకు రూ. 40 కోట్లు ఇస్తామంటూ ఆఫర్ చేశారని నాగమారుతీ శర్మ సోమవారం కోర్టుకు వెల్లడించారు. ఈ ఆఫర్‌ను తాను తిరస్కరించినట్టుగా చెప్పారు. ప్రాణాన్నైనా వదులుకొంటాను కానీ, ధర్మాన్ని తప్పనంటూ తాను తనకు ఆఫర్ ఇచ్చిన వ్యక్తులకు స్పష్టం చేసినట్టుగా ఆయన తెలిపారు. ఈ కేసులో క్రాస్ ఎగ్జామినేషన్ కోసం వచ్చే నెల 12వ తేదీకి విచారణను వాయిదా వేశారు.

## నన్నెప్పుడూ మిత్రుడిగా చూడలేదు

### కుమారస్వామిపై మండిపడ్డ సిద్ద రామయ్య

బెంగళూరు,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ): కన్నడనాట కూటమి కోటలో రాజుకున్న ఆరోపణల అగ్గి ఇంకా రాజుకుంటూనే ఉంది. మాజీ ముఖ్యమంత్రులిద్దరూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. నిన్నటికి నిన్న 'సిద్ధరామయ్య నా మొదటి శత్రువు'అని కుమార స్వామి అన్నారో లేదో..వెంటనే సిద్ధరామయ్య నుంచి రిటర్న్ గిఫ్ట్ వెళ్లింది. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కుమారస్వామి నా మీద ప్రతీకారం తీర్చుకోవాలన్న ఉద్దేశం ఉంది కాబట్టే కూటమి ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగలేకపోయింది. ఆయన నన్నెప్పుడూ మిత్రుడిలా పరిగణించలేదు. శత్రువులాగే చూశారు' అని విమర్శించారు. కొత్తగా ఏర్పడిన భాజపా ప్రభుత్వంపైనా విమర్శనాస్త్రాలు సంధించారు.' అడ్డదారి తొక్కి భాజపా అధికారంలోకి వచ్చింది. మంత్రి పదవుల పంపకంలో భాజపాలో ముసలం ఏర్పడిందని నాకు తెలుసు. వాళ్లలో ఎంతోమంది అసమ్మతితో ఉన్నారు. భాజపా అధిష్ఠానానికి యడియూరప్ప అనవసర సంతానంగా మారారు. ప్రభుత్వం వచ్చిన ఎన్నో రోజులకు మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ఇప్పటికీ వారికి మంత్రుల శాఖలను కూడా కేటాయించ లేదు. యడియూరప్పకు సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కూడా లేదు' అంటూ మాటల్లో పదును పెంచి మాట్లాడారు. కాంగ్రెస్- జేడీఎస్ కూటమి ప్రభుత్వం జులై 22న కూలిపోయిన విషయం తెలిసిందే. రెండు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల్లో కొందరు రాజీనామా

# లోకేశ్, బ్రాహ్మణిల పెళ్లి రోజు

### భార్యకు శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దంపతులు సోమవారం తమ 12వ పెళ్లిరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా తన భార్య బ్రాహ్మణిపై తనకున్న ప్రేమను ట్విటర్ ద్వారా తెలియజేశారు. ప్రత్యేకంగా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. 12ఏళ్లు.. 144 నెలలు.. 4,383రోజులు, 1,05,192 గంటలు, 63,11,520 నిమిషాలు.. ఇన్ని రోజుల్లో నిన్ను ప్రేమించకుండా ఉండని క్షణం లేదు.. నా మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమిస్తున్నా.. పెళ్లి రోజు శుభాకాంక్షలు బ్రాహ్మణి' అంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఉన్న ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. ఇది చూసిన అభిమానులు వీరికి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మీ ఆనందమైన ఈ జీవితం చిరకాలం సుఖ సంతోషాలతో సాగిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.. పెళ్లి రోజు శుభాకాంక్షలు'.. 'అన్న, వదినకు పెళ్లిరోజు శుభాకాంక్షలు'.. 'హ్యాపీ వెడ్డింగ్ యానివర్సరీ'.. అంటూ పలువురు కామెంట్లు పెడుతున్నారు. 2007లో వివాహబంధంతో ఒక్కటైన వీరికి కుమారుడు దేవాన్ష్ ఉన్నాడు.

# తుమ్మిడిహట్టి వద్ద నిర్మిస్తే ఖర్చు తగ్గేది

### ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించిన కాంగ్రెస్

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆంఎన్ఎ): తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే.. తక్కువ ఖర్చుతో ప్రాణహిత జలాలు అందేవని పిసిసి అధ్యక్షుడు ఉత్తంకుమార్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. తుమ్మిడిహైదహట్టి ప్రాజెక్ట్‌ను తెలంగాణ కాంగ్రెస్ ప్రతినిధుల బృందం సోమవారం పరిశీలించింది. నీటిపారుదల ప్రాజెక్టుల్లో అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సీఎల్పీ నేత భట్టి మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్ట్ పూర్తి చేసివుంటే సాగు, తాగు నీటీ అవసరాలు తీరడమే కాకుండా 1.50 లక్షల కోట్లు ఆదా అయ్యేవని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలోనే అత్యంత ఎత్తైన తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ నిర్మాణం చేసి.. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని సరఫరా చేసేందుకు వీలుగా ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ చేసిందని భట్టి గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రూ.38వేల కోట్ల అంచనాతో రూపొందించాం. రూ.10వేల కోట్ల విలువైన పనులు పూర్తిచేశాం. ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ సస్యశ్యామలం అయ్యేది. 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. రాష్ట్రంలోని 80 శాతం ప్రాంతాలకు తాగునీరు లభించేది.కానీ.. కమిషన్ల కోసం కాళేశ్వరం పేరుతో సీఎం కేసీఆర్ లక్ష కోట్ల రూపాయల అంచనాతో రీడిజైనింగ్ చేశారని ఆరోపించారు. తాగునీటి అవసరాల కోసమంటూ రూ.50వేల కోట్లతో మిషన్ భగీరథ పేరుతో మరో ప్రాజెక్టు చేపట్టారని దుయ్యబట్టారు. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్టాన్ని దోచుకొనేందుకే ఈ ప్రాజెక్టుల రీడిజైనింగ్ చేపట్టారని ఆరోపించారు. ఈ విషయాలను ప్రజలకు లెక్కలతో సహా వివరించేందుకే సోమవారం నుంచి కాంగ్రెస్ 'ప్రాజెక్టుల బాట' కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ బృందంలో ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, నేతలు విహెచ్, షబ్బీర్ అలీ తదితరులు ఉన్నారు.

## కెటిఆర్‌ను మంత్రిగా చూడాలనుకుంటున్నా

### అసదుద్దీన్ ట్వీట్

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన్ను మళ్లీ ప్రభుత్వంలో చూసేందుకు ఎదురు చూస్తున్నానంటూ ట్వీట్ చేశారు. గతేడాది ఒప్పో.. ఇటీవల అమెజాన్.. ఇవాళ వన్‌ప్లస్‌తో హైదరాబాద్ అంతర్జాతీయ శక్తిగా ఎదుగుతోందన్న ఓ జర్నలిస్టు ట్వీట్ పై అసదుద్దీన్ స్పందించారు. ఆ ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌దేనని అసద్ పేర్కొంటూ.. ఆయనను మళ్లీ సర్కారులో చూసేందుకు వేచిచూస్తున్నానని వ్యాఖ్యానించారు. ఆ ట్వీట్‌కు కేటీఆర్ స్పందిస్తూ అసద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకాశాన్నంటిన బంగారం ధరలు

### భారీగా పెరిగిన ధరలతో 40వేలకు చేరువ

న్యూఢిల్లీ,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ): దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలకు రెక్కలొచ్చాయి. రూపాయి క్షీణత, బలమైన అంతర్జాతీయ సంకేతాలతో వరుసగా ఐదో రోజు ఈ లోహాల ధరలు పెరిగాయి. సోమవారం ఒక్కరోజే రూ. 675 పెరిగి పసిడి ధర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. నేటి బులియన్ మార్కెట్లో 10 గ్రాముల పసిడి ధర రూ. 39,670కు చేరింది. ఆగస్టు 20 నుంచి ప్రతిరోజూ పుత్తడి ధర పెరుగుతూనే ఉంది. అటు వెండి కూడా నేడు బంగారం దారిలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణెలిల తయారీదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో నేటి మార్కెట్లో వెండి ధర రూ. 1,450 పెరిగింది. దీంతో కేజీ వెండి రూ. 46,550 పలికింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణత, ఆర్థిక మాంద్యం ఆందోళనల నేపథ్యంలో బంగారం లో పెట్టుబడులు పెట్టడమే శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి తోడు దేశీయంగా కూడా కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ధరలు అమాంతం పెరుగుతున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే సుంకెకు నిర్వాసితుల నుంచి వ్యతిరేకత

### -పరిహారం కోసం పట్టుబట్టిన గ్రామస్థులు

రాజన్న సిరిసిల్ల,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): జిల్లాలో హరితహారంలో పాల్గొనేందుకు వచ్చిన టీఆర్ఎస్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మిడ్‌మానేరు నిర్వాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. తమ డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే ముందుకు కదలాలంటూ కొదురుపాక, నీలోజిపల్లి నిర్వాసితులు సోమవారం ఆయన్ను అడ్డుకున్నారు. ఇళ్లకు రూ.5,40,000 అందించడంతోపాటు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు కటాఫ్ డేట్ లేకుండా కుటుంబ పరిహారం ఇచ్చేవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చుకున్నారు. నిర్వాసితులకు రావాల్సిన పరిహారం ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే రవిశంకర్ హామీ ఇచ్చినప్పటికీ వారు ఆందోళన విరమించలేదు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య ఆయన అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించకపోతే ఈ నెల 30న కలెక్టరేట్ ముందు మహాధర్నా చేపడతామని నిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# లడఖ్‌లో 29న రాజ్‌నాథ్ పర్యటన

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 29న లడఖ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన లేహ్‌ను సందర్శించనున్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు తర్వాత లడఖ్‌లో రాజ్‌నాథ్ పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా లడఖ్ వాసులతో పాటు అక్కడున్న భద్రతా బలగాలతో రాజ్‌నాథ్ మాట్లాడనున్నారు. ఇటు చైనా, అటు పాక్ సరిహద్దుల్లో ఉన్న భద్రతపై రాజ్‌నాథ్ సమీక్షించనున్నారు. ఈ నెల మొదటి వారంలో లోక్‌సభ, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు బిల్లు ఆమోదం పొందిన విషయం విదితమే. జమ్మూ-కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పడ్డాయి.

# సన్నబియ్యం సరఫరాలో నాణ్యతకు ప్రాధాన్యం

### ఎట్టి పరిస్తితుల్లోనూ రాజీపడబోం
### పెట్రోల్ బంకుల్లో నాణ్యతపైనా దృష్టి
### పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి




సచివాలయం వద్ద పునరుద్దరించిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన తెలంగాణ పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి . చిత్రంలో కమిషనర్ అకున్ సబర్వాల్ కూడా ఉన్నారు.

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్‌ఎన్‌ఎ): రేషన్‌షాపుల ద్వారా పేదలకు అందించే బియ్యం, ప్రభుత్వ పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు సరఫరా చేసే సన్నబియ్యం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని తెలంగాణ పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నపెట్రోల్ బంకుల్లో క్వాలిటీతోపాటు, పరిమాణం విషయంలోనూ రాజీపడకుండా కఠినంగా ఉంటామని అన్నారు. ఇక పెట్రోల్‌బంకుల ప్రాంగణాల్లో టాయిలెట్స్, మంచినీరు, వాహనాలకు గాలి వంటి కనీస సౌకర్యాల విషయంలోనూ పకడ్బందీగా వ్యవహరిస్తామని అన్నారు. సెక్రటేరియట్ వద్ద ఆధునీకరించిన పౌరసరఫరాలశాఖ పెట్రోల్ బంక్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు అందించే బియ్యంనాణ్యత విషయంలో కఠినంగా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలు, సూచనలు ప్రకారం బియ్యం నాణ్యత విషయంఒ ఏమాత్రం రాజీ పడ బోమని ఆయనచెప్పారు. దీని కోసం పౌరసరఫరా సంస్థలో సాంకేతిక సిబ్బందితో ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్నిఏర్పాటు చేశామని తెలిపారు. టెక్నికల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు గోదాముల్లో నిరంతరం బియ్యం నాణ్యతను పరిశీలిస్తామని పేర్కొన్నారు. మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించే సమయం లోనూ నాణ్యతను ఖచ్చితంగా పరిశీలిస్తామన్నారు పెట్రోల్‌నాణ్యత విషయంలో ఇటీవల పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ రాష్ట్రవ్యాప్తంగా 2553 పెట్రోల్ బంకులకుగాను 638 బంకుల్లో తూనికలు కొలతలశాఖ, పౌరసరఫరాలు, ఆయిల్ కంపెనీల అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారని వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న 187 బంకులకు నోటీసులు జారీ చేశామన్నారు. పెట్రోల్‌బంకుల్లో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈసందర్భంగా పౌరసరఫరాలశాక కమిషనర్ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌తోపాటు ఎల్‌బి నగర్, హకీంపేట పెట్రోల్ బంకులు కొనసాగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రయత్నాలుచేస్తున్నామని ఈ పెట్రోల్ బంకులను పౌరసరఫరాల సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు.

# పది జిల్లాల్లోనే నక్సల్స్ ప్రభావం

## అమిత్ షా నేతృత్వంలో హోంశాఖ అభిప్రాయం

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): దేశవ్యాప్తంగా కేవలం 10 జిల్లాల్లోనే నక్సల్స్ సమస్య ఎక్కువగా ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. దీన్ని నివారించేందుకు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులను స్థానికులకే అప్పగించాలని సమావేశం నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉన్న పరిమితిని రూ.5లక్షలకు రూ.50లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో బ్యాంకులు, టవర్లు, తపాలా సేవలు అందుబాటులోకి తేవాలని ఈ భేటీలో నిర్ణయించారు.

అభివృద్ధి తప్ప మరో అంశానికి తావు ఉండకూడదని అమిత్‌షా అన్నారు. మావోయిస్ట్ సమస్యను ఎదురో్కవడంలో తెలుగు రాష్ట్రాలు రోల్ మోడల్‌గా నిలిచాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రశంసించారు. దేశంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో పరిస్థితిని బేరీజు వేసేందుకు కేంద్ర హోంశాఖ నిర్వహిస్తున్న ఈ సమావేశంలో భద్రత, అభివృద్ధి, గిరిజన హక్కులపై చర్చించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితుల గురించి హోంశాఖ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చింది. అవకాశం ఉన్న ప్రతి చోటా ఏటీఎంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీ, తెలంగాణలో నక్సల్స్ నిర్మూలన చర్యలు చేపట్టడంలో సఫలీకృతమయ్యామని హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా తెలిపారు. ఇదిలావుంటే గిరిజన ప్రాంతంలో ప్రత్యేక మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీఎం జగన్ కోరారు. ప్రత్యేక ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నెలకొల్పాలని సూచించారు. విజయనగరం జిల్లా సాలూరులో ఓ ట్రైబల్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు. తెలంగాణ నుంచి హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, జార్ఖండ్ సీఎం రఘుబర్ దాస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, చత్తీస్‌గఢ్ సీఎం భాఘేల్, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి, ఆయా రాష్ట్రాల డీజీపీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పత్తి మద్దతు ధరల్లో తేడాలు రావద్దు

## అధికారులకు మంత్రి నిరంజన్ సూచన

హైదరాబాద్,ఆగస్ట్27 (ఆర్‌ఎన్‌ఎ): పత్తి మద్దతు ధరలో తేడా రావొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగదు చెల్లింపులు వెంటనే జరగాలన్నారు. పత్తి మొదటి రకం రూ.5,550, రెండో రకం రూ.5,255. గత ఏడాది 230 మిల్లులు గుర్తించగా, 37 మార్కెట్లలో కొనుగోళ్లు జరిగాయి. ఈ ఏడాది 302 మిల్లులు గుర్తించడం జరిగింది. వ్యాపారులు మిల్లుల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలి. తూకం విషయంలో ఎలాంటి తేడాలు రావొద్దు. వే బ్రిడ్జ్‌లు సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. అనుమతిచ్చిన ఛార్జీలకు మించి రైతుల నుంచి ఒక్క పైసా ఎక్కువ వసూలు చేయొద్దు. గుర్తింపు లేని రైతులను గుర్తించి స్థానిక అధికారులు క్యూఆర్ కోడ్ ఇవ్వాలి. పత్తి కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్‌లో డబ్బులు జమచేయాలి. డబ్బులు జమచేయడంలో జాప్యం చేయొద్దు. కొనుగోలుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు చేసుకోవాలని మంత్రి సూచించారు. తూకాల విషయంలో తేడాలు రావద్దని, వే్బ్రిడ్జిలు సరిగా ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. అనుమతించిన ఛార్జీలకు మించి రైతులనుంచి ఒక్క పైసా కూడా అదనంగా వసూలు చేయవద్దని స్పష్టం చేశారు. గుర్తింపు కార్డులు లేని రైతులను గుర్తించి వెంటనే క్యూఆర్ కోడ్ ఇవ్వాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్ళు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్‌లో డబ్బు జమచేయాలని, వివరాల లోపం పేరుతో ఏమాత్రం జాప్యం జరగొద్దని స్పష్టం చేశారు. ఈ అంశాలకు సంబంధించిన పూర్తి బాధ్యత కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), మార్కెటింగ్ శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. సీసీఐ ఎండీ ఆలీరాణి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారధి, కమిషనర్ రాహుల్ బొజ్జా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లలలక్ష్మీబాయి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### హరిద్వార్ గంగలో జైట్లీ అస్తికల నిమజ్జనం

హరిద్వార్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు అరుణ్ జైట్లీ అస్తికలను గంగానదిలో నిమజ్జనం చేశారు. అంతిమ సంస్కారాలు కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తల అశ్రు నయనాల మధ్య న్యూఢిల్లీలోని నిగంబోధ్ శ్మశాన వాటికలో ఆదివారం జరిగిన విషయం తెలిసిందే. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించడానికి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కాగా, సోమవారం ఆయన అస్థికలుహరిద్వార్ ప్రాంతంలోని గంగా నదిలో కలిపారు.

# మరింత బలంగా భారత్,అమెరికా వాణిజ్య బంధం

### ఇరు దేశాధినేతల ఉమ్మడి మీడియా సమావేశం
### కశ్మీర్ ద్వైపాక్షిక అంశమన్న ట్రంప్

బియరిట్స్,ఆగస్ట్27 (ఆర్‌ఎన్‌ఎ): భారత్- అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం మరింతగా మెరుగుపరుస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. శాంతి సహా అనేక విషయాలపై జీ7 సదస్సులో చర్చ జరిగిందని ఆయన తెలిపారు. జీ7 సదస్సులో భాగంగా ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్న ఆయన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఇరువురూ సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ సంక్షేమానికి భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ చెప్పారు. వాణిజ్యం, రక్షణ సహకారంపై సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయన్నారు. భారత్-పాక్ ఎన్నో ద్వైపాక్షిక అంశాలపై పోరాటం చేయాల్సి ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం, పేదరికం లాంటి ఎన్నో అంశాలపై భారత్-పాక్ యుద్ధం చేయాల్సి ఉందన్నారు. పాక్ ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్ ఎన్నికయ్యాక ఫోన్ చేసి అభినందించానని మోదీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తామిద్దరం పలు అంశాలపై చర్చించుకున్నట్లు చెప్పారు. ట్రంప్ మాట్లాడుతూ కశ్మీర్ అంశంపైనా సదస్సులో చర్చ జరిగిందన్నారు. కశ్మీర్‌లో పరిస్థితులు అదుపులోనే ఉన్నట్లు మోదీ చెప్పారని ట్రంప్ వివరించారు. భారత్-పాక్ రెండూ అమెరికాకు మిత్ర దేశాలని ఆయన స్పష్టం చేశారు. కశ్మీర్ విషయం భారత్-పాక్ ద్వైపాక్షిక అంశమని.. రెండు దేశాలు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకుంటాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# భవిష్యత్‌లో కశ్మీర్ లాంటి నిర్బంధాలు తప్పవు

### మీడియా సమావేశంలో అఖిలేశ్ హెచ్చరిక

లక్నో,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): జమ్మూకశ్మీర్ ప్రజల కదలికలపై కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ తప్పుపట్టారు. బీజేపీ అనుసరిస్తున్న సంస్థాగత నియంత్రణ కళ గురించి మనమంతా తెలుసుకోవాలి. 370 అధికరణ రద్దు అనేది తమ మేనిఫెస్టోలో పెట్టి బీజేపీ అమలు చేసింది. ఈరోజు వాళ్లకు (కశ్మీరీలకు) ఏం జరిగిందో అదే రేపు మనకూ జరగవచ్చు' అని సోమవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అఖిలేష్ చెప్పారు. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దును అఖిలేష్ ప్రశ్నిస్తూ, ఇవాల్టికి 20 రోజులకు పైనే కశ్మీర్ ప్రజలు ఇళ్లల్లోనే బందీలయ్యారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయం అంతగొప్పదైతే ప్రజల ఆమోదాన్ని ఎందుకు పొందలేకపోయిందని నిలదీశారు. 'నేను చెప్పదలచుకున్నదేదో అది లోక్‌సభలోనే చెప్పాను. దానికంటే చెప్పేదేమీ లేదు' అని ఆయన అన్నారు. విపక్ష నేతలు శ్రీనగర్ వెళ్లేటప్పుడు ఒకింత ఆలోచన చేయాలంటూ బీఎస్‌పీ చీఫ్ మాయావతి వ్యాఖ్యానించిన నేపథ్యంలో అఖిలేష్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# నల్లా పన్నులపై నిరసన

### పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన

వరంగల్,ఆగస్ట్27 (నేటినిజం ప్రతినిధి) నర్సంపేట పట్టణంలో పెంచిన నల్లా పన్నులను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పాలై శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెంచిన నల్లా పన్నులను నిరసిస్తూ.. కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నర్సంపేటలో నిరసన ప్రదర్శన జరిపారు. పాకాల కూడలి నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో రవికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెంచిన కుళాయి పన్నులు తగ్గించేవరకు తమ ఆందోళన విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామానంద్, సాంబరెడ్డి, సాంబయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ నోరు పారేసుకున్న పాక్ ప్రధాని ఇమ్రాన్

## భారత్ అంటే హిందువులదేనా అంటూ వ్యాఖ్య

ఇస్లామాబాద్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): కశ్మీర్ అంశం గురించి పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరోమారు నోరు పారేసుకున్నారు. అంతేగాకుండా భారత్ అంతర్గ వ్యవహారాలపై కూడా అతిగా మాట్లాడారు. సోమవారంనాడాయన పాక్ జాతిని ఉద్దేశించి ప్రకటన చేశారు. కశ్మీర్‌లో జరుగుతున్న అంశాలపై ఐక్యరాజ్యసమితిదే బాధ్యత అని, అక్కడ జరుగుతున్న మార్పుల గురించి ప్రపంచ దేశాలకు తాము తెలియజేయనున్నట్లు ఇమ్రాన్ అన్నారు. కశ్మీర్ ప్రజల పట్ల తాము ఆందోళనగా ఉన్నామన్నారు. కశ్మీరీల కోసం యూఎన్ ముందుకు వస్తుందా లేదా వేచి చూడాలన్నారు. రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని, కానీ ఇప్పుడు కశ్మీర్ అంశంలో సూపర్ పవర్ దేశాల బాధ్యత ఎక్కువగా ఉంటుందని ఇమ్రాన్ అన్నారు. విద్య, మాంద్యం, ఆరోగ్యం, వాతావరణం లాంటి సమస్యలు రెండు దేశాలకు ఉన్నాయని, వాటి గురించి ఆలోచించాలన్నారు. ట్రంప్, మోదీ మధ్య పారిస్‌లో భేటీ జరిగిన తర్వాత ఇమ్రాన్ దేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఎఫ్‌ఏటీఎఫ్‌లో పాక్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు ఇండియా ప్రయత్నించిందని ఆరోపించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి మోదీ చరిత్రాత్మక తప్పిదం చేశారని ఇమ్రాన్ అన్నారు. కశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేశారు, మరి భారత దేశం కేవలం హిందువులకేనా అని ఇమ్రాన్ ప్రశ్నించారు. 1920లో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారు, దాంట్లో నుంచి బీజేపీ పుట్టిందని, శాంతి చర్చలకు మోదీ ప్రభుత్వం ఎందుకు రావడం లేదని, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలనే బీజేపీ పాటిస్తోందని, ఇండియా అంటే హిందువులే అన్న ఐడియాతో ఆర్‌ఎస్‌ఎస్ ఉందని ఇమ్రాన్ అన్నారు.

# సామాన్యుల చెంతకు ఇస్రో ఫలాలు

## షార్ డైరెక్టర్ ఆర్ముఖం రాజారాజన్

శ్రీహరికోట,ఆగస్ట్27 (ఆర్‌ఎన్‌ఎ): విద్యార్థులు అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఒకే విషయంపై ఏకాగ్రతతో అధ్యయనం చేసేలా దృష్టి పెట్టుకోవాలని షార్ డైరెక్టర్ ఆర్ముఖం రాజారాజన్ పేర్కొన్నారు. శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో సోమవారం విక్రమ్ సారాభాయ్ శతజయంత్యుత్స వాలు ప్రారంభ మయాయి. ఈ కార్యక్రమాన్ని రాజారాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్రో ఫలాలను సామాన్యుల వద్దకు తీసుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులంతా అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని ఆ దిశగా పయనించాలని సూచించారు. విక్రమ్ సారాభాయ్ ఒక్కొక్క అంశానికి ఒక్కొక్క సంస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆయన హయాంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఏర్పాటై ఎన్నో విభాగాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. 1970లో 45 కిలోల ఆర్యభట్టను అంతరిక్షంలోకి పంపితే 2019నాటికి 4,500 కిలోల బరువుగల చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని రోదసికి పంపి విజయవంతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ జేవి రాజారెడ్డి, ఉపసంచాలకులు ఎమ్‌బిఎన్ మూర్తి, డీడీలు వెంకట్రామన్, హమిద్, పొంగినన్, యహ ందొరై, కుంభకర్ణన్, శల్వరాజ్, రంగనాథన్, బివి సుబ్బారావు, పాల్గొన్నారు.

# ఐఎన్‌ఎక్స్ మీడియాకు ఎఫ్‌ఐపీబీ క్లీయరెన్స్

## చిదంబరం కేసులో సిబల్ వాదనలు

న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): ఐఎన్‌ఎక్స్ మీడియాకు ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్‌ఐపీబీ) క్లియరెన్స్ ఇచ్చినది ఆరుగురు ప్రభుత్వ సెక్రటరీలని మాజీ కేంద్ర మంత్రి చిదంబరం తరఫున ఈ కేసులో వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుపై సిబల్ సోమవారంనాడు తన వాదనలను అత్యున్నత న్యాయస్థానానికి వినిపించారు. విదేశీ పెట్టుబడులను తీసుకురావడానికే ఐఎన్‌ఎక్స్ మీడియాకు ఎఫ్‌ఐపీబీ అనుమతులు ఇచ్చింది. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శితో సహా ఆరుగురు సెక్రటరీలు ఎఫ్‌ఐపీబీలో ఉన్నారు. వారిలో ఒకరు ఆర్‌బీఐ గవర్నర్ కూడా అయ్యారు' అని న్యాయమూర్తులు బీ.బానుమతి, ఏఎన్ బోపన్నలతో కూడిన ధర్మాసనానికి సిబల్ విన్నవించారు. ఎఫ్‌ఐపీబీ అనుమతులు ఇవ్వగా, తన ÷-లకెయింట్ ఒక మంత్రిగా కేవలం సంతకం చేశారని తెలిపారు. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ప్రమేయాన్ని కూడా సిబల్ తోసిపుచ్చారు. ఎఫ్‌ఐపీబీ కార్యదర్శులను దర్యాప్తు సంస్థలు విచారించినప్పుడు ఏ ఒక్కరూ కార్తీ చిదంబరం తమను సంప్రదించినట్టు చెప్పనేలేదన్నారు. ఈడీ కేసు అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ గురించి మాట్లాడింది కానీ, కార్తీ కానీ, చిదంబరానికి కానీ ఇందులో ఎలాంటి ప్రమేయం లేదని చెప్పారు. చిదంబరం లేదా ఆయన అసోసియేట్ల పేరుతో విదేశాల్లో 17 బ్యాంకు అకౌంట్లు, 10 ఆస్తులు ఉన్నట్టు గుర్తించామని ఈడీ చెబుతోందని, అయితే ఒక్క బ్యాంకు అకౌంట్ కానీ, ఆస్తి కానీ చిదంబరంతో ప్రమేయమున్నట్టు చూపిస్తే తాను చేసిన అప్పీల్‌ను ఉపసంహరించుకుంటానని సిబల్ కోర్టుకు తెలిపారు.

చిదంబరం కస్టడీ పొడిగింపు

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఢిల్లీ పత్యేక న్యాయస్థానం కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కస్టడీని సోమవారం మరో నాలుగు రోజులకు పెంచింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ ఇప్పటికే ఆయన్ను కస్టడీలో ఉంచి విచారించిన సంగతి తెలిసిందే. ఆయన నాలుగు రోజుల రిమాండ్ ఈ రోజుతో ముగిసింది. దాంతో సీబీఐ మరో ఐదు రోజుల పొడిగింపు కోరుతూ ఢిల్లీ న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 30 వరకు చిదంబరాన్ని సీబీఐ కస్టడీలో ఉంచి, విచారించేందుకు న్యాయస్థానం అనుమతించింది.

# విద్యుత్ ఒప్పందాల్లో సిబిఐ విచారణ ఎదుర్కోండి

## విద్యుత్ సంస్థలకు పదివేల కోట్ల బకాయిలు

## తెరాసపై విమర్శల దాడిని పెంచిన బిజెపి

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): తెరాస ప్రభుత్వంపై రాష్ట్ర భాజపా స్వరం పెంచింది. విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె లక్ష్మణ్ అన్నారు. విద్యుత్ విషయంలో అధికారులతో వివరణ ఇప్పించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. వారినే బలి పశువులను చేస్తారా అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలకు 10వేల కోట్ల బకాయిలు ఉన్నాయన్న లక్ష్మణ్. విద్యుత్ ఒప్పందాలు, చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని చెప్పారు. ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. బీజేపీ ప్రశ్నించిన వాటికి సర్కార్ నుంచి సమాధానం లేదన్నారు గ్రామ పంచాయతీ బిల్లు చెల్లించని సర్పంచ్‌ను తొలగిస్తామన్న మిమ్మల్ని.. విద్యుత్ సంస్థలకు బిల్లులు కట్టనందుకు ఏం చేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వం చేతగానితనంతోనే విద్యుత్ సంస్థలు రూ.20వేల కోట్ల నష్టాల్లో ఉన్నాయని అయన వివరించారు. ప్రజల సొమ్మును దుబారా చేస్తే భాజపా ఊరుకోదన్నారు. ప్రజాకోర్టులో సీఎం కేసీఆర్‌ను దోషిగా చూపుతామన్నారు. సోలార్ ఒప్పందాలతో రూ.8 వేల కోట్లు రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని తెలిపారు. అవినీతిలో తెరాస ప్రభుత్వానికి డాక్టరేట్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలోని అన్ని రంగాల్లో అవినీతిని వెలికి తీస్తామని.. న్యాయపోరాటం చేస్తామని లక్ష్మణ్ అన్నారు.

# రెవెన్యూలో సమస్యల పరిష్కార వేదిక

కరీంనగర్,ఆగస్ట్27(నేటినిజం ప్రతినిధి) రెవెన్యూలో సేవలు సరళతరం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, అవినీతికి దూరంగా అధికారులను నిలపడం ఈ పథకం ఉద్దేశంగా ఉంది. ఇది ఎలాంటి ఫలితం ఇస్తుందో చెప్పలేకున్న ఓ ప్రయత్నం మాత్రం చేపట్టారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటంతో రెవెన్యూ శాఖలో పెనవేసుకుపోయిన అవినీతిని తుద ముట్టించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతిసారీ ప్రజావాణికి భూ సమస్యలపై అర్జీలు రావడం, రెవెన్యూ డివిజన్లలో పెద్దది కావడం పర్యవేక్షణ పూర్తిస్థాయిలో చేసే అవకాశం లేకపోవడంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. వేల సంఖ్యలో రైతులు వివిధ సమస్యలతో నలిగిపోతుండగా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ పరిణామం. ఇక ఎవరైనా డబ్బులు అడిగితే తీవ్రంగా పరిగణించనున్నారు. ప్రతి దరఖాస్తు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ఫిర్యాదుల కేంద్రం దోహదపడనుంది. కేంద్రంలో ఉండే సిబ్బంది వచ్చే ఫోన్ కాల్స్‌ను రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు అనుసంధానిస్తారు. నిర్ణీత గడువు అనంతరం మళ్లీ అదే సమస్యపై ఫిర్యాదు వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు. కిందిస్థాయి నుంచి తహసీల్దార్ వరకు ఎవరు తప్పు చేసినా చర్యలు చేపట్టేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

క్రీడలు

# మరిన్ని మెడల్స్ సాధిస్తా : పీవీ సింధు




హైదరాబాద్: దేశానికి మరిన్ని మెడల్స్ అందిస్తానని పీవీ సింధు పేర్కొన్నది. తన ఫ్యాన్స్ అందరికీ థ్యాంక్స్ చెబుతున్నట్లు ఆమె చెప్పింది. వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన హైదరబాదీ షట్లర్ పీవీ సింధు సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నది. అభిమానులు ఆశీస్సులు, ప్రేమ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నట్లు తెలిపింది.

స్విట్జర్లాండ్‌లోని బాసిల్‌లో జరిగిన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సింధు గోల్డ్ మెడల్ కొట్టింది.

వరల్డ్ టోర్నీలో పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా సింధు రికార్డు క్రియేట్ చేసింది. ఢిల్లీలో ఉన్న సింధు ఇవాళ ప్రధాని మోదీతో పాటు కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజుజును ఆమె కలుసుకోనున్నది.

## కేంద్ర క్రీడామంత్రిని కలిసిన సింధు

హైదరాబాద్: కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజును షట్లర్ సింధు కలిసింది. స్విట్జర్లాండ్‌లో జరిగిన వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన సింధు సోమవారమే ఢిల్లీకి వచ్చింది. అక్కడ ఆమె ఇవాళ కిరణ్ రిజిజును కలుసుకున్నది. పీవీ సింధు సాధించిన ఘనతను మంత్రి మెచ్చుకున్నారు. తొలిసారి వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సాధించిన భారత క్రీడాకారిణిగా సింధు దేశ గౌరవాన్ని పెంచిందన్నారు. దేశానికి ఆమె మరిన్ని పతకాలు అందించాలంటూ మంత్రి తన ట్విట్టర్‌లో ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# కోహ్లీ జోడీతో ఆటగాళ్ల హంగామా..



ఆంటిగ్వా: విండీస్‌తో తొలి టెస్టు విజయానంతరం భారత ఆటగాళ్లు హాలీడే ఎంజాయ్ చేస్తున్నారు. రెండో టెస్టుకు కావాల్సినంత విరామం దొరకడంతో ఆటగాళ్లతో పాటు జట్టు సిబ్బంది కరీబియన్ దీవుల్లో బిజీ బిజీగా గడుపుతున్నారు. కెప్టెన్ కోహ్లితో పాటు అతని భార్య అనుష్కశర్మ, రవిచంద్రన్ అశ్విన్, కే ఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్ హార్బర్ సముద్రతీరంలో షిప్పింగ్ చేస్తూ తెగ జాలీగా గడుపుతున్నారు.

సముద్రంలో హాయిగా గడుపుతున్నట్లు అశ్విన్, రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో తమ అనుభవాలను పంచుకున్నారు. కాగా, మొదటి టెస్టులో ఇండియా రహానే, విహారీ, కోహ్లి, జడేజా బ్యాటింగ్ మెరుపులతో, ఇషాంత్, బుమ్రా ఐదు వికెట్ల పర్ఫార్మెన్స్‌తో విండీస్‌పై భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రహానే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## రవిశాస్త్రి ఫోటోపై ట్రోల్స్..

ఆంటిగ్వా: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మొదటి టెస్టులో విండీస్‌పై నాలుగు రోజుల్లోనే గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా విరామ సమయంలో కొకొబే బీచ్‌లో జాలీగా గడుపుతోంది. కోచ్ రవిశాస్త్రి ఈ సందర్భంగా ఓ ఫోటోను ట్విట్టర్ ద్వారా పంచుకున్నాడు. హాట్ హాట్ వాతావరణంలో హాయిగా జ్యూస్‌తో ఇలా.. కోకోబే లోని షీర్ రాక్ రెస్టారెంట్ చాలా అందంగా ఉంది. అని క్యాప్షన్ ఇచ్చాడు.

అయితే ఈ ఫోటోపై అతడంటే గిట్టని కొందరు నెటిజన్స్ విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. అతడు జాలీగా చేతులు చాచి ఫోటోకు ఫోజులివ్వగా, నెటిజన్స్ మాత్రం ఆయన చేతుల్లో మద్యం బాటిల్స్ ఉంచి ఫోటోను మార్ఫింగ్ చేసి, పలు రకాలుగా స్పందిస్తున్నారు. మద్యంతో ఎంజాయ్ చేస్తున్నాడని కొందరు, అందుకే హాయిగా ఉన్నట్టుందని మరికొందరు కామెంట్లు రాస్తున్నారు. కాగా, రవిశాస్త్రి వచ్చే టీ20 వరల్డ్‌కప్ వరకు హెడ్‌కోచ్‌గా నియమితులవడం తెలిసిందే.

# బిజెపి విమర్శలకు పదును

### లెక్కచేయని స్థితిలో టిఆర్ఎస్
### అనవసర ప్రాధాన్యం ఇవ్వవద్దనే ధోరణిలో కెసిఆర్?

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో బిజెపి విమర్శలకు పదను పెట్టింది. అయితే ఇవేవీ పెదద్గా పట్టించుకునే పరిస్థితుల్లో కెసిఆర్ లేరు. ప్రస్తుతం తెలంగాణలో కెసిఆర్ నేతృత్వంలోని టిఆర్ఎస్‌కు పూర్తి మెజార్టీ ఉంది. తిరుగేలేని నేతగా కెసిఆర్ ఉన్నారు. పార్టీ అంతా ఆయన చెప్పుచేత్లోలనే ఉంది. ఆయన మాట శిరోధ్యార్యంగా శ్రేణులు ఉన్నాయి. చేసస్తున్న పనులు, పథకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు. ప్రజలు కూడా తమవెంటే ఉన్నారన్న భరోసా ఉంది. ప్రజలంతా కెసిఆర్ పాలనపట్ల పాజిటివ్ దృక్పథంతో ఉన్నారు. కెసిఆర్‌ను ఎదరించి నిలబడగల దమ్మున్న నేత కూడా లేరు. విపక్షాలు బలహీనంగా ఉన్నాయి. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఇంకా సానుకూలత లేదు. బిజెపి పట్ల ప్రజలకు పెద్దగా భరోసాలేదు. కారణం బిజెపిలో గట్టి నాయకుడు కూడా లేదు. బిజెపి హడావిడి చేస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అనవసరంగా బిజెపి చేస్తున్న విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వరాన్న ధోరణిలో కెసిఆర్ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రత్యక్షంగా పరోక్షంగా విమర్శలుకూడా చేయడం లేదు. కేవలం కెటిఆర్, మంత్రులు మాత్రమే బిజెపి విమర్శలను తిప్పి కొడుతున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మనసులో ఏమి ఉందో తెలుసుకోవడం చాలా కష్టం. తెలంగాణ ఉద్యమ క్రమాన్ని, పోరాట శైలిని గమనిస్తే కెసిఆర్ ఎప్పుడు ఎందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో చెప్పడం కష్టం. ఊహించడం మరింత కష్టం. అందుకే ఆయన ఆలోచనా సరళిని తెలుసుకోవడంలో ప్రత్యర్థులు విఫలం అవుతుంటారు. తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసిన నాటి నుంచి ఆయా సందర్భాలలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు పార్టీ సహచరుల అంచనాలకు అందేవి కావు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రిగా కేసీఆర్ అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత ఐదేళ్లుగా ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రజలకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చేవే! ప్రస్తుత రాజకీయాలలో ప్రజలు కూడా వ్యక్తిగత ప్రయోజనాలనే ఆశిస్తున్నారు. సంక్షేమం పేరిట ప్రజలను తనవైపునకు తిప్పుకోవడంలో కేసీఆర్‌అనేక పథకాలను ప్రకటించారు. ఓ రకంగా పథకాలతో ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నారు. దాదాపు మెజార్టీ వర్గాలు లబ్దిపొందాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ అందరికంటే ఎక్కువ పథకాలు ప్రకటిస్తున్నారు. ప్రజలు ఇలాంటి పథకాలు కావాలని అనుకుంటారు. ఊళ్లో కాలేజో, రోడ్డో కావాలని కోరుకోరు. అందుకే ప్రజలు తనవెన్నంటి ఉన్నారని వరుస ఎన్నికల్లో రుజువు అయ్యింది. దీంతో బిజెపి రంకెలు వేస్తున్నా కెసిఆర్ మౌనంగా ఉంటున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేవు గనక వీరావేశం అక్కర్లేదన్న ధోరణిలో సిఎం కెసిఆర్ ఉన్నారు.

# గిరిజనులకు గిట్టుబాటు ధరలు

### జిసిసి బలోపేతంతో సత్ఫలితాలు

ఆదిలాబాద్,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ): ఉట్నూరు కేంద్రంగా గిరిజన సహకార సంస్థ గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం మధ్య దళారులను తొలగించి వారు సేకరించే అటవీ ఫలసాయాలను కొనుగోలు చేసి వారికి గిట్టు బాట ధరను చెల్లించాలనే సంకల్పానికి అనుగుణంగా కార్యాక్రమాలు సాగుతున్నాయి. మార్పులకు అనుగుణంగా జీసీసీని బలోపేతం చేస్తున్నారు. గిరజనలు అవసరాలను గుర్తించి వాటిని తీర్చడంతోపాటు వారి అభివృద్ధి లక్ష్యంగా గతానికి భిన్నంగా కొత్త కార్యక్రమాలను శ్రీకారం చుట్టింది. అధికారుల కృషిఫలితంగా ప్రగతి దిశలో పయనిస్తోంది. ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా గిరిజన సహకార సంస్థ కొత్త కొత్త ఆలోచనతో ముందకెళ్తొంది. గిరిజనులకు నాణ్యమైన నిత్యావసర సరకులు, కాస్మోటిక్స్‌లు, వివిధ ఆహార పదార్థాలు ఎమ్మార్పీ ధర కంటే తక్కువకు అందించి ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో ఐటీడీఏ సహాకారంతో గిరిజన సూపర్ బజార్‌ను ఏర్పాటు చేశారు. ఇది మంచి ఫలితాలు ఇస్తోంది. ప్రతి నెల రూ.3 నుంచి 4 లక్షల వ్యాపారం ఈ గిరిజన సూపర్ బజార్ ద్వారా చేసస్తొన్నారు. నిరుద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం ఈ సేవను వినియోగిం చుకుంటున్నారు. దీంతో జీసీసీ స్వల్ప లాభంతోపాటు గిరిజనులకు తక్కువ ధరకు మంచి సరుకులు లభిస్తున్నాయి. భవిష్యత్తులో ఆదిలాబాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తిర్యాని, కెరమెరి, నార్నూరు మండలాలలో ఇప్పటికీ 60 గ్రామాలకు చెందిన గిరిజనులు డీఆర్‌డిపోల నుంచి నిత్యావసర సరుకులను తీసుకెళ్లడానికి రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడం, ఎత్తైన ప్రదేశం ఉండడంతో చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారు. మారుమూల గ్రామాల గిరిజనుల ఇంటింటికి నిత్యావసర సరుకులను సరఫరా చేస్తోంది. గిరిజనులు అడవుల నుంచి సేకరించే బంక, తేనే, ఇప్పపువ్వు, ఇప్పపరక, మైనం తదితర కలపేతర వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరను చెల్లించి కొనుగోలు చేయడంతోపాటు మారుమూల గిరిజన గ్రామాలు, తండాలలో నివసించే అడవిబిడ్డలకు అవసరమైయ్యే నిత్యావసర సరుకులను చౌకధరలకే డీఆర్‌డిపోల ద్వారా సరఫరా చేస్తోంది. జిల్లా వాసులకు నాణ్యమైన తేనే తక్కువ ధరకే అందుబాటులోకి రానుంది. అటవీ హక్కుల చట్టం కింద భూములు పొందిన గిరిజన రైతులు పత్తి, సోయా తదితర వాణిజ్య పంటలు సాగు చేస్తుంటారు. మొదటి సారి ఆ రైతులకు అవగాహన కల్పించి వంట మార్పిడికి చర్యలు తీసుకున్నారు. ఏజెన్సీలో నివసిస్తున్న ఐటీడీఏ, పోలీసు, అటవీశాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గిరిజన, సాంఘీక సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలకు అవసరమైయ్యే వంట గ్యాస్ బండలను ప్రైవేటులో కొనుగోలు చేయకుండా గిరిజన సహకార సంస్థ ఐటీడీఏ సౌజన్యంతో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని నిర్వహిస్తోంది.

## గిరిజనేతరులపై చిన్నచూపు తగదు

ఆదిలాబాద్,ఆగస్ట్27 (ఆంఎన్ఎ): ఎన్నికల్లో ఓట్లు వేసుకున్న నాయకులు అధికారంలోకి వచ్చాక గిరిజనేతరుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధకరమని గిరిజనేతులరు సంఘం నేతలు అన్నారు. ఎంతోకాలంగా ఇక్కడే పుట్టి ఇక్కడే జీవిస్తున్న వారి మస్యలను పట్టించుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు ఎదుర్కొంటున్న పహాణీ, భూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ఆ సంఘం జిల్లా నాయకులు పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి గిరిజనేతరులు సాగుచేస్తున్న భూములకు పహాణీలు ఇచ్చేవారని ప్రస్తుతం వాటిని ఆపేయడంతో రుణాలు లభించక గిరిజనేతరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తోందన్నారు. తమ పోరాటం ఆదివాసీ గిరిజనులకు వ్యతిరేకం కాదన్నారు. వారి హక్కులకు భంగం కల్గకుండానే తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడే పుటుటి ఉంటున్న వారిపట్ల ఇలాంటి వివక్ష తగదనారు. భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో మరో సమావేశాన్ని ఏర్పాటుచేసి తగిన నిర్ణయం తీసుకుం టామ న్నారు. తమసమస్యలపై పోరాటాలు చేస్తున్నా నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇది తీవ్రం కాకముందే అధికారుల మేల్కొనాలన్నారు.

# లక్ష్యం మేరకు హరితహారం పనులు

ఆదిలాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): జిల్లాలో హరితహారం లక్ష్యం నెరవేరుతోందని డ్వామా పిడి అన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేప్టటామని అన్నారు. జిల్లావ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని ఇందులో భాగంగా ఇప్పటివరకు లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటినట్లు డ్వామా పీడీ తెలిపారు. త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని అన్నారు. ఈ యేడాది చేపట్టిన పనుల కోసం కూలీ వేతనాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఉపాధి కార్డులు పొందిన ప్రతిఒక్కరికి పూర్తి స్థాయిలో పనిదినాలను కల్పించడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఉపాధి పనులు, హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పనులను, ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కూలీల నమోదు మస్టర్ల రికార్డులు, సమావేశాల నిర్వహణ రిజిస్టర్లు లాంటి తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. మానవాళి మనుగడకు వృక్షాలే ప్రధాన ఆధారమన్నారు. అడవులు లేకపోతే భూగోళంపై పెను విపత్తులు సంభవిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 23శాతం ఉన్న అడవుల శాతాన్ని 33శాతాని కి పైగా పెంచడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని తీసుకున్నాం న్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ సంవత్సరం కోటి మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే దాదాపు సగం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు అన్ని వర్గాల భాగస్వామ్యంతో హరితహారాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు.

# అవినీతికి కేంద్రంగా రీడిజైనింగ్

నిజామాబాద్,ఆగస్ట్27 (ఆర్ఎన్ఎ): ప్రాజెక్టుల రీడిజైనింగ్‌కు కారణం అవినీతి ప్రణాళిక అని డిసిసి అధ్యక్షుడు తాహిర్ బిన్ అన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికే నిజాలు దాస్తున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము కోరుతుండగా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. దీనికి తోడు కేసులు పెడతామని సిఎం స్థాయి వ్యక్తి బెదిరించడం దారుణమని అన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు భయపెడుతున్నారని నిందించారు. వాస్తవాలను కప్పిపుచ్చి గొప్పలు చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్రతో సాగునీటి ప్రాజెక్టుల ఒప్పందం ఈ కోవకే వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిందని పేర్కొంటూ దాని ప్రభావం ఎస్సారెస్పీపై పడుతుందన్నారు. ఇక

శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల విభజనజరగడం లేదన్నారు. స్పష్టమైన విధానం రూపొందించి విభజన చేపట్టాలని, ఇందుకోసం ఎవరూ డిమాండ్ చేయాల్సిన అవసరంలేదన్నారు. విధాన రూపకల్పన లోటుపోట్లు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయన్నారు.

## నిజాం షుగర్ ఫ్యాక్టరీపై చిత్తశుద్ధి ఏదీ?

నిజామాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడమే లక్ష్యంగా తెలంగాణ జనసమితి పోరాడుతుందని ఆ పార్టీ కన్వీనర్ గోపాల్‌శర్మ తెలిపారు. రైతులకు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా తాముా పోరాడుతామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిజాం చక్కెర కర్మాగారాన్ని

ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే ఐదేళ్లయినా ఈ సమస్య కొలిక్కి రాలేదన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో నిజాం చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం పరం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం తానుఇచ్చిన మాటను నిలబెట్టు కోలేదన్నారు. 2015లో చక్కెర కర్మాగారాన్ని తాళం వేశారన్నారు. దీంతో అందులో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే చెరకు రైతులకు కూడా కష్టకాలం దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించి చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించడానికి కావాల్సిన నిధులు సమకూర్చుకోవాలన్నారు.

## సకాలంలో మరుగుదొడ్ల నిర్మాణాలు

ఆదిలాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల కార్యక్రమం కింద ఎంపిక కాని గ్రామాలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.

ఆయా గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు బిల్లులకోసం తిప్పలు పడుతున్నారని పలువురు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. ఎక్కడెక్కడ ఏ మేరకు బిల్లులు రావాల్సి ఉందో తనకు వివరాలు ఇస్తే స్వచ్ఛ భారత్ మిషన్ పథక సంచాలకులతో తాను మాట్లాడుతానని వివరించారు. సీఆర్ఎఫ్, నాన్ సీఆర్ఎఫ్‌ల కింద వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు అందజేయాలని ఆదేశించారు.

సినిమా

# ఆసక్తికరంగా 'వార్' ట్రైలర్



బాలీవుడ్ సూపర్‌స్టార్ హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'వార్'. 'బ్యాంగ్ బ్యాంగ్' దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎంతో ఆసక్తికరంగా తీర్చిదిద్దిన ఈ ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలు పెంచుతోంది. యాక్షన్‌కు పెట్టింది పేరు హృతిక్, టైగర్. ఇప్పుడు ఇద్దరూ తెరపై సందడి చేసేందుకు సిద్ధం కావడంతో ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆత్రుతతగా ఎదురుచూస్తున్నారు. హృతిక్, టైగర్ మధ్య వచ్చే భారీ పోరాట సన్నివేశాలు, ఉత్కంఠ రేకెత్తించే కార్ ఛేజింగులు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయని చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో వాణీ కపూర్ కథానాయిక. యశ్‌రాజ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం గాంధీ జయంతి సందర్భంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'మిస్ ఇండియా'గా కీర్తి సురేష్




'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకుంది కీర్తి సురేష్. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రధారిగా ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. నరేంద్రనాథ్ దర్శకుడు. మహేష్ కోనేరు నిర్మాత. ఇటీవలే యూరప్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి 'మిస్ ఇండియా' అనే పేరును ఖరారు చేసినట్టు ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. నిర్మాత మాట్లాడుతూ 'కీర్తి సురేష్ నుంచి ఇప్పుడు ప్రేక్షకులు ఎలాంటి సినిమాని కోరుకుంటారో, అలాంటి సినిమానే 'మిస్ ఇండియా'. ప్రతి అమ్మాయి తన జీవితంలో ఎక్కడో ఒక చోట ఎదుర్కొనే పరిస్థితుల నేపథ్యంలో దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందీ చిత్రం. కీర్తి సురేష్ జాతీయ పురస్కారాన్ని గెలుచుకొన్నాక నటిస్తున్న తొలి చిత్రం మా సంస్థలోనే కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పటికే సింహభాగం చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన భాగాన్ని పూర్తిచేసి, అక్టోబరు లేదా నవంబరులో చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. 'కీర్తి సురేష్ మాత్రమే న్యాయం చేయగల కథ ఇది. అందుకే ఈ కథ సిద్ధమయ్యాక ఆమెకి వినిపించగానే నచ్చి ఒప్పుకొన్నారు. అన్ని రకాల భావోద్వేగాలున్న చిత్రం' అన్నారు దర్శకుడు.

# ప్రేమకోసం పరిగెత్తాల్సిన అవసరం లేదు : నిత్యామీనన్



ప్రేమ కోసం ఎక్కడికో పరుగులు తీయాల్సిన అవసరం లేదు అంటోంది నటి నిత్యామీనన్. ఈ కేరళా అమ్మడు నటించిన హిందీ చిత్రం మిషన్ మంగళ్ ఇటీవలే తెరపైకి వచ్చింది. ప్రస్తుతం తలైవి(జయలలిత)గా మారడానికి రెడీ అవుతోంది. అంతే కాకుండా రెండు మలయాళ చిత్రాల్లోనూ నటిస్తూ

బిజీగా ఉంది. విభిన్న పాత్రల్లో, వైవిధ్య చిత్రాల్లో నటించే నటీమణుల్లో నిత్యామీనన్ ఒకరు. మిషన్ మంగళ్ చిత్రంలో ఈమె నటించడానికి కూడా ఇదే కారణం.

కాగా ప్రేమ, పాశం గురించి ఈ సుందరి ఏమంటుందో చూద్దాం. 'ప్రేమ కోసం వెతుక్కోకండి. అసలు ప్రేమకు మరోకరు అవసరమే లేదు. మనలో మనమే ప్రేమను నింపుకుంటే ప్రపంచమే ప్రేమమయం అవుతుంది. సంతోషంగా ఉన్నవాళ్లు దాన్ని ఇతరులకు పంచుతారు. ప్రేమను కలిగినవారే దాన్ని ఇతరులతో పంచుకుంటారు. ప్రేమ అనేది అనుభవంగా ఉండకూడదు. అది అనుభవించేదిగా ఉండాలి.

నిన్ను ప్రేమించడానికి నీకంటే మంచివాళ్లు ఎవరూ ఉండరు. అసలు ప్రేమ అనేదాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నాం. ఐలవ్యూ అనే మాటను కూడా తప్పుగా భావిస్తున్నాం. ఇతరులపై చూపే ప్రేమాభిమానాలు, మనం మనపై చూపుకునే ప్రేమ అంటూ ప్రేమ పలు రకాలు. ప్రేమ కోసం వెతుకుంటూ ఎక్కడికో వెళ్లనవసరం లేదు. ప్రేమ అనేది ప్రపంచంలో ఎక్కడో లేదు. అది మనలోనే ఉంది. లోపల ఉన్న దాన్ని బయటకు తీస్తే, అదే నిజమైన ప్రేమ.

ప్రేమ అనేది మననుంచే ప్రారంభం కావాలి. అది మీ వద్ద లేకుంటే ఇతరుల వద్ద లభిస్తుందని ఆశించి పరిగెత్తకూడదు. మనల్ని ఇతరులు గౌరవించాలని భావిస్తున్నాం. ముందు మనల్ని మనమే గౌరవించుకోవాలి' అని నటి నిత్యామీనన్ పేర్కొంది.

# తమిళ రీమేక్‌లో రవితేజ



తమిళంలో సూపర్ హిట్టయిన 'విక్రమ్‌వేద' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. ఈ రీమేక్‌లో మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తారని వార్తలు వినపడుతున్నాయి. దర్శక ద్వయం పుష్కర్, గాయత్రి తెరకెక్కించిన 'విక్రమ్ వేద'లో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ విక్రమ్‌గా మాధవన్, గ్యాంగ్‌స్టర్ వేద పాత్రలో విజయ్‌సేతుపతి నటించారు. సుధీర్ వర్మ దర్శకత్వంలో ఈ రీమేక్ తెరకెక్కుతుందట. ప్రస్తుతం తెలుగు నేటివిటీకి తగ్గట్లు సుధీర్ వర్మ స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నారట. కథ ప్రకారం విక్రమ్, వేద పాత్రల ఢీ అంటే ఢీ అనేలా ఉంటాయి. తెలుగు రీమేక్‌లో పోలీస్ ఆఫీసర్ విక్రమ్‌గా రవితేజ కనపడతారట. మరి గ్యాంగ్‌స్టర్ వేద పాత్రను ఎవరో చేయబోతున్నారో వేచి చూడాలి. ప్రస్తుతం 'డిస్కోరాజా' చిత్రీకరణలో రవితేజ బిజీగా ఉన్నారు

# ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన

## యువతిని మట్టుపెట్టిన ప్రేమికుడు
## ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడి పట్టివేత
## తానే చంపినట్లు అంగీకరించిన దుర్మార్గుడు

ఖమ్మం,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లాలో దారుణం జరిగింది. ప్రేమించిన ఓ యువతిని యువకుడు దారుణంగా అంతమొందించాడు. నమ్మకంగా ప్రేమ నటించిన ఆ దుర్మార్గుడు ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి అంతమొందించాడు. పెనుబల్లి మండలంలో ఈ ప్రేమోన్మాది ఘాతుకానికి నమ్మిన వెళ్లిన యువతి బలైంది. ప్రేమించిన యువకుడే దారుణంగా హత్య చేయడం కలకలం రేపుతోంది. ఆదివారం సాయంత్రం ఆమెను గుట్టపైకి తీసుకెళ్లిన యువకుడు.. చేతి రుమాలును ఆమె గొంతుకు బిగించి ప్రాణాలు తీశాడు. వివరాల్లోకి వెళ్తే.. పెనుబల్లి మండలం కుప్పినకుంట్లకు చెందిన కావిటి తేజస్విని(20) సత్తుపల్లి మండలం గంగారంలో సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో గతంలో పాలిటెక్నిక్ చదివింది. సత్తుపల్లికి చెందిన నితిన్ కూడా అదే కళాశాలలో చదివాడు. ఆ సమయంలో వీరిద్దరూ ప్రేమించుకున్నారు. పాలిటెక్నిక్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిలై తేజస్విని ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. నితిన్ ఖమ్మంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం తేజస్వినిని ద్విచక్రవాహనంపై ఇంటినుంచి తీసుకువెళ్లాడు. తమ కుమార్తె కనిపించకపోవడంతో యువతి తల్లిదండ్రులు సోమవారం వీఎమ్‌బంజర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు తేజస్విని ఫోన్ కాల్‌డేటాలో నితిన్ నెంబరును గుర్తించారు. నితిన్ ఖమ్మం వసతి గృహంలో ఉన్నట్లు గుర్తించి మంగళవారం వేకువజామున అదుపులోకి తీసుకొని విచారించగా తాను చేతి రుమాలుతో హత్యచేసినట్లుగా పోలీసులకు చెప్పాడు. ఘటనాస్థలంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. కల్లూరు ఏసీపీ వెంకటేశ్, సత్తుపల్లి సీఐ సురేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది. నమ్ముకున్న వాడు హత్య చేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

BEFORE THE HONBLE COMMISSIONER FOR WORKMENS COMPENSATION ASST. LABOUR COMMISSIONER IV HYDERABAD
E.C.NO.32 OF 2017
E.C.NO.33 OF 2017
E.C.NO.257 OF 2018

Between:
**Govindu Basappa Ramappa**
...Petitioners
**And**
**Mr. Mohd Taufeeq and Others**
..Respondents

To
**Mr. Mohd Taufeeq**
**S/o. Mohd Ismail,**
**Age: Major**
**Occ: Owner of Lorry bearing No.AP 23W 1060,**
**H.No. 2-1-55, Saipur Tandur, R.R.Dist.**
...Respondent No.1

Whereas the above named Petitioners filed compensation petition against you and The New India Assurance Company Ltd. for a sum of Rs. 6,00,000/- for the accident caused by your vehicle Lorry bearing No.AP 23W 1060 on 28-07-2015 at Karank ote ps limits. The above case is posted on **29-08-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 3.00 PM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and deter-mined expate.

(BY ORDER OF THE COURT)
**C. VENU GOPAL REDDY**
**S. VENLAT REDDY**
Advocates.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderbad.
Cell: 9440431541

# కట్టుకున్న భర్తను కాటికి పంపిన కసాయి

## ప్రియుడితో చంపించిన భార్య, ప్రియుడి అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కలకాలం కలిసి జీవితాన్ని పంచుకుందామనుకున్న భర్తను భార్యే చంపించిన ఘటన షాపూర్‌నగర్‌లో జరిగింది. డీసీపీ పద్మజ వివరాల మేరకు.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ మండలం తూకుంటకు చెందిన నక్క రామారావు(42) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆయనతో పాటు ఒడిషాకు చెందిన శివ(34) పని చేసేవాడు. కొన్ని రోజులుగా రామరావు భార్యతో శివ సన్నిహితంగా ఉంటూ, వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇది గమనించిన రామారావు అతని భార్యను పలుమార్లు మందలించాడు. అయినా అతని మాట వినని ఆమె శివతో అక్రమ సంబంధం కొనసాగించింది.

తన భర్త ఈ విషయంపై మళ్లీమళ్లీ హెచ్చరిస్తున్నాడని ఆమె ప్రియుడు శివతో చెప్పి,అతన్ని చంపడానికి పన్నాగం పన్నింది. అతనికి రూ.ఐదు వేలు ఇచ్చి ఈ రోజు ఎలాగైనా అతన్ని చంపాలని చెప్పింది. దీంతో శివ, రామారావుతో నిర్మాణంలో ఉన్న ఒక భవనంలో కూర్చొని ఫూటుగా మద్యం తాగించాడు. అనంతరం ఖాళీ బాటిల్‌తో అతని గొంతు కోసి హతమార్చి, అటునుంచి పారిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శివపై అనుమానంతో తమ శైలిలో ఆరా తీయగా, తామే హత్య చేసినట్లు అతని భార్య ఒప్పుకుంది. పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

# కూలిన శిక్షణ విమానం: తప్పిన ముప్పు

లక్నో,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్ ధనిపూర్ వద్ద మంగళవారం ఉదయం శిక్షణ విమానం కూలింది.

వీటీ-ఏవీవీ విమానం కూలిన ఘటనలో ఎవరూ గాయపడలేదు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో ఆరు మంది ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ల్యాండింగ్ సమయంలో విమానం ప్రమాదానికి గురైనట్లు అనుమానిస్తున్నారు. అయితే విమానంలో ఉన్న ఆరుగురికి ఎటువంటి గాయాలు కాలేదని సిటీ మెజిస్ట్రేట్ చెప్పారు.

# తొలి మహిళా డీజీపీ కంచన్ చౌదరి భట్టాచార్య మృతి

ముంబై,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): భారతదేశ తొలి మహిళా మాజీ డీజీపీ కంచన్ చౌదరి భట్టాచార్య కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చౌదరి భట్టాచార్య.. ముంబయిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. భట్టాచార్య మృతిపట్ల దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, ఐపీఎస్ అధికారులు నివాళులర్పించారు. భట్టాచార్య సేవలను ఉత్తరాఖండ్ పోలీసులు గుర్తు చేసుకున్నారు. 1973 బ్యాచ్‌కు చెందిన భట్టాచార్య.. ఉత్తరాఖండ్ తొలి మహిళా డీజీపీగా 2004లో నియామకం అయ్యారు. 2007, అక్టోబర్ 31న పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున హరిద్వార్ లోక్‌సభ నియోజకవర్గానికి పోటీ చేశారు .తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్ బేడీ కాగా, కంచన్ చౌదరి భట్టాచార్య ఐపీఎస్ సాధించిన రెండో మహిళగా ఘనత సాధించారు. భట్టాచార్య హిమాచల్‌ప్రదేశ్‌లో జన్మించారు. అమృత్‌సర్ ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి డిగ్రీ పట్టా పొందారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ఇందప్రస్థ కాలేజీ నుంచి ఇంగ్లీష్ లిటరేచర్ అభ్యసించారు. 1993లో ఆస్ట్రేలియాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ చేశారు.

# ఆహారంలో పురుగులు.. మండిపడ్డ నటి

అహ్మదాబాద్,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): ఇటీవలి కాలంలో హోటల్స్, రెస్టారెంట్స్ ల భోజనంలో పురుగులు రావడం సర్వసాధారణం అయ్యింది. ఫుడ్‌లో పురుగులు రావడం, లేదంటే దాని వలన అనారోగ్యానికి గురి కావలసి వస్తుంది.ఇది సామాన్యుల విషయంలోనే కాదు సెలబ్రిటీల విషయంలోను జరుగుతుంది. తాజాగా 'బంగారం', 'వాన' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటి మీరా చోప్రా అహ్మదాబాద్‌లోని ఓ హోటల్‌కు వెళ్లి ఫుడ్ ఆర్డర్ చేయగా అందులో పురుగులు వచ్చాయి. దీంతో సదరు హోటల్‌పై మండిపడ్డారు. 'అహ్మదాబాద్‌లోని డబుల్ ట్రీ అనే హోటల్‌కు వెళ్లి, అక్కడ ఫుడ్ ఆర్డర్ చేశాను. అందులో తెల్లటి పురుగులు చూసి షాక్ అయ్యాను. భారీ మొత్తంలో డబ్బు తీసుకుని నాకు ఇలాంటి పురుగులున్న ఫుడ్ పెట్టారు. ఆహార భద్రతా అధికారులు వెంటనే దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి' అంటూ పోస్టు చేశారు.

# కన్నడ బిజెపి అద్యక్షుడిగా నలినీ కుమార్

బెంగళూరు,ఆగస్ట్27(ఆర్ఎన్ఎ): కర్ణాటక భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా నలిన్ కుమార్ కతీల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్ప.. నలిన్ కుమార్‌కు సన్మానం చేసి సత్కరించారు. అనంతరం బీజేపీ అధ్యక్షుడిగా నలిన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నలిన్ కుమార్‌కు సీఎం యెడియూరప్పతో పాటు మిగతా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE 12th. ADDL. CHIEF JUDGE AT: SECUNDERABAD**
**O.P. NO. 448 OF 2016**

Between
T Bharthi Reddy
.....Petitioner/Petitioner
And
Suresh Kumar Pasunoori & others
....Respondent/ Respondents

To,
1.Suresh Kumar Pasunoori,
P.Brahmachari, Major
Occ:Driver cum Owner,
R/o.H.No. 1-46,
Gavaravaram, Eluru,
West Godavari,
Andhra Pradesh
....Respondent No.1

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P. No. 448/2016 for compensation and the above O.P. is posted to **30-8-2019** at 10.30.A.M. for your appearance either in person or through Advocate. If you are fail to appear on that day this case will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Counsel for Petitioner
**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
ADVOCATES
H.No. 12-11-329
WARASIGUDA
SECUNDERABAD
CELL NO: 9848145873

**IN THE COURT OF THE 27th. ADDL. CHIEF JUDGE**
AT: SECUNDERABAD
**O.P. NO. 617 OF 2018**

Between
S Naveen
...Petitioner/ Petitioner
And
Mohammed Dastagiri & others
....Respondent/ Respondents

To,
1. Mohammed Dastagiri,
s/o Mohammed Yousuf, Major
Occ; Driver, H.No: 2103/2,
Bata Singaram Hayatnagar,
Ranga Reddy – 501506
....Respondent No.1
2. Mohd Salim,
s/o Mohd. Yousuf Khan, Major
Occ: Business,
R/o 19-2-127/1/24,
Bahadurpura
Hyderabad – 500001
.....Respondent No.2

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P. No. 617/2018 for compensation and the above O.P. is posted to **11-9-2019** at 10.30.A.M. for your appearance either in person or through Advocate. If you are fail to appear on that day this case will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Counsel for Petitioner
**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
ADVOCATES
H.No. 12-11-329
WARASIGUDA
SECUNDERABAD
CELL NO: 9848145873

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.